ప్రజాశక్తి

బుధవారం 29 మే 2024

8 పేజీలు

విశాఖపట్నం అనకాపల్లి



పెరుగుతున్న విద్యుత్ వినియోగం

- పలుచోట్ల అనధికారిక కోతలు
- ఉష్ణోగ్రతలు, ఉక్కపోత పెరగడంతో అధికమైన ఎసి, కూలర్ల వాడకం

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

అధిక ఉష్ణోగ్రతలు, ఉక్కపోత ఉండడంతో ఆ ప్రభావం విద్యుత్ వినియోగంపై పడింది. వర్షాలు పడతాయన్న వాతావరణ శాఖ ప్రకటనతో కొంత ఊరట లభిస్తుందని అనుకున్నా, ప్రస్తుత వాతావరణం బయటకు వెళ్లడానికి వీలుకానిరీతిలో ఉంది. ఉక్కపోత ఎక్కువవడంతో ఫ్యాన్లు, ఎసిలు, కూలర్ల వాడకం ఉమ్మడి విశాఖ జిల్లాలో పెరిగింది. గత నెల కంటే ఈ నెలలో సాధారణ డిమాండ్ కంటే విద్యుత్ వినియోగం అధికమైంది. ఉమ్మడి విశాఖ జిల్లాలోని రోజువారీ సగటు విద్యుత్ వినియోగం 28.364 మిలియన్ యూనిట్లుగా వుంది. కానీ వేసవి వేడి, ఉక్కపోతతో సగటు వినియోగం దాటిపోతోంది. విద్యుత్ వినియోగం పెరగడంతో సర్దుబాటు చేసే క్రమంలో గ్రామీణ ప్రాంతంలో విద్యుత్ కోతలు అనధికారికంగా జరుగుతున్నాయి. ఎక్కువగా మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు, మళ్లీ రాత్రి వేళ విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉంటోంది. ఇళ్లలో ఫ్యాన్ల వాడకం కంటే ఎసిల వినియోగం ఎక్కువగా వుండడంతో విద్యుత్ వినియోగం పెరుగుతున్నట్లు అధికారులు చెబుతున్నారు.

ఏప్రిల్ కంటే మేలో విద్యుత్ వినియోగం పెరిగింది. ఏప్రిల్‌లో కూడా ఉక్కపోత, ఉష్ణోగ్రత ఎక్కువగా వున్న రోజుల్లో అధిక విద్యుత్ వినియోగం నమోదైంది. ఈ ఏడాది మే, ఏప్రిల్ నెలల్లో 21 నుంచి 27 వరకు ఇపిడిసిఎల్ విశాఖపట్నం సర్కిల్‌లో నమోదైన విద్యుత్ వినియోగాన్ని పరిశీలిస్తే విద్యుత్ వాడకంలో హెచ్చు, తగ్గులు కనిపిస్తున్నాయి. వాతావరణ పరిస్థితులు ఇలానేవుంటే విద్యుత్ వినియోగం ఇంకా పెరుగుతుందని విద్యుత్ శాఖాధికారులు చెబుతున్నారు.

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో 21 నుంచి 27 వరకు మే, ఏప్రిల్ నెలల్లో విద్యుత్ వినియోగం (మిలియన్ యూనిట్లలో)

తేదీ	మే వినియోగం	ఏప్రిల్ వినియోగం
21	30.631	29.310
22	30.547	29.540
23	31.563	31.538
24	30.647	29.854
25	28.055	29.920
26	29.235	30.491
27	30.815	29.447

ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్‌గా

పరమేశ్వర్ ఫంక్వాల్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్‌గా పరమేశ్వర్ ఫంక్వాల్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఐఐటి కాన్పూర్‌లో విద్యాభ్యాసం చేసిన ఆయన ఇండియన్ రైల్వే సర్వీస్ ఆఫ్ ఇంజినీర్స్ 1988 బ్యాచ్ అధికారిగా రైల్వే శాఖలో ప్రవేశించి మూడున్నర దశాబ్దాల పాటు పలు విభాగాల్లో పనిచేశారు. రాజ్‌కోట్ డిఆర్ఎంగా, అహ్మదాబాద్ ఎడిఆర్ఎంగా, ఆర్ఆర్‌బి ఛైర్మన్‌గా, ఆర్‌డిఎస్ఒ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పలు ఉన్నత స్థానాల్లో విధులు నిర్వర్తించారు. ప్రస్తుతం ఈస్ట్ కోస్ట్ రైల్వేలో ముంబయిలోని పశ్చిమ రైల్వేలో ప్రిన్సిపల్ చీఫ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న ఆయన ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్‌గా బదిలీపై వచ్చారు.

ఆర్‌డిఎస్ఒ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పనిచేసిన సమయంలో ట్రాక్ వంతెనల రంగాలలో రైళ్ల వేగాన్ని పెంచడానికి వినూత్న సాంకేతిక పరిజ్ఞానాన్ని పరిచయం చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. రైల్వే ఇంజినీరింగ్‌తో పాటు మానవ వనరుల విధులు, పరిశోధన, డిజైన్‌లు, నిర్వహణలో అపారమైన అనుభవం కలిగి ఉన్నారు. ఆయన అంతర్జాతీయ జర్నల్స్‌లో ట్రాక్, బ్రిడ్జ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీరింగ్‌పై అనేక పరిశోధన పత్రాలను సమర్పించారు. గతంలో బీజింగ్ (చైనా), కాల్గరీ (కెనడా), న్యూఢిల్లీల్లో జరిగిన ఇంటర్నేషనల్ హెవీ హాల్ అసోసియేషన్ సమావేశాలలో పత్రాలను సమర్పించమే కాకుండా స్వీడన్, డెన్మార్క్, ఫ్రాన్స్, జర్మనీ, చైనా, కెనడా, మలేషియా, సింగపూర్, ఇటలీలలో వివిధ శిక్షణ అధ్యయనాల్లో పాల్గొన్నారు. ఫంక్వాల్‌కు సాహిత్యం పట్ల అమితమైన ఆసక్తి. పలు రచనలు చేశారు. అవి హిందీ సాహిత్య పత్రికలలో ప్రచురించబడ్డాయి.

వేసవి ప్రత్యేక రైళ్లు రద్దు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సంబల్‌పూర్–కాచిగూడ మార్గంలో తక్కువ ఆక్యుపెన్సీ కారణంగా వేసవి ప్రత్యేక రైళ్లను అధికారులు రద్దు చేశారు. ఈ క్రమంలో 08325 సంబల్‌పూర్–కాచిగూడ సమ్మర్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌ను జూన్ 17, 24 తేదీల్లోను, 08326 కాచిగూడ–సంబల్‌పూర్ సమ్మర్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌ను జూన్ 18, 25 తేదీల్లోనూ రద్దు చేశారు.

అలరించిన సంగీత విభావరి

▶ వార్త 2లో..

గ్రంథాలయాల్లో ఉత్సాహంగా సమ్మర్ క్యాంపులు

▶ వార్త 3లో..

బెస్ట్ వాల్యూ యూనివర్సిటీల్లో ఎయుకు మెరుగైన స్థానం

▶ వార్త 2లో..

వైజాగ్ పోర్టు ట్రస్టులో ఏర్పాటు చేసిన గ్యాలరీలో కొలువుదీరిన ఛాయాచిత్రాలు

ఛాయా చిత్రాల్లో పోర్టు ప్రగతి

విపిటిలో ఆకట్టుకుంటున్న ఆర్ట్ గ్యాలరీ

వార్త 2లో..

ఓట్ల లెక్కింపు ఏర్పాట్లు పూర్తి

విశాఖ జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ఎ.మల్లికార్జున



మాట్లాడుతున్న విశాఖ జిల్లా ఎన్నికల అధికారి మల్లికార్జున

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జిల్లాలోని పార్లమెంటు నియోజకవర్గ ఓట్ల లెక్కింపునకు సంబంధించి అన్ని ఏర్పాట్లూ పూర్తయినట్లు విశాఖ కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ఎ.మల్లికార్జున రాజకీయ పక్షాల అభ్యర్థులకు తెలిపారు. ఆంధ్రా యూనివర్సిటీ ట్రిపుల్ ఈ బ్లాక్ నందు పార్లమెంటు నియోజకవర్గ ఓట్ల లెక్కింపు ఉంటుందని అన్నారు. పార్లమెంటు బరిలో పోటీ చేసిన అభ్యర్థులకు, వివిధ రాజకీయ పక్షాల ప్రతినిధులకు ఓట్ల లెక్కింపు ప్రక్రియపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం కలెక్టర్ కార్యాలయ వీడియో సమావేశ మందిరంలో నిర్వహించారు. పోస్టల్ బ్యాలెట్, ఇవిఎం ఓట్ల లెక్కింపు, కౌంటింగ్ టేబుళ్ల ఏర్పాటు, సిబ్బంది నియామకం, ఏజెంట్లు, అభ్యర్థులు పాటించాల్సిన నిబంధనలు, చట్టపరమైన అంశాలపై కలెక్టర్ అభ్యర్థులకు వివరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంటు నియోజకవర్గ కౌంటింగ్ ప్రక్రియ సజావుగా, ప్రశాంతంగా పూర్తిచేసేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

సమావేశంలో పాల్గొన్న రాజకీయ పార్టీల అభ్యర్థులు, ప్రతినిధులు

ఓట్ల లెక్కింపు ఏర్పాట్లు పూర్తి

కోరారు. ఇవిఎంలలోని ఓట్లు, పోస్టల్ బ్యాలెట్ లెక్కించడానికి వేర్వేరుగా లెక్కింపు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఇవిఎం ఓట్ల లెక్కింపు కోసం 104 టేబుళ్లు, పోస్టల్ బ్యాలెట్ కోసం మరో 18 టేబుళ్ల చొప్పున ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇసిఐ నిబంధనల మేరకు ప్రతి టేబుల్ దగ్గరా ఒక కౌంటింగ్ ఏజెంట్‌ను నియమించుకునే అవకాశం అభ్యర్థులకు ఉందని, ఈ నెల 31 నాటికి ఏజెంట్ల వివరాలు సమర్పించాలని చెప్పారు. వీరుకాకుండా ఆర్ఓ దగ్గర అభ్యర్థి లేదా జనరల్ ఏజెంట్ కూర్చొనే అవకాశం ఉందన్నారు. నియోజకవర్గాల వారీగా ఏజెంట్ల వివరాలను అందజేస్తే, వారికి వెంటనే గుర్తింపు కార్డును జారీ చేస్తామని చెప్పారు. మొదట పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు మొదలవుతుందని, అరగంట తరువాత ఇవిఎంల లెక్కింపు ప్రారంభమవుతుందని తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించబోమని కలెక్టర్ స్పష్టం చేశారు. అలాగే ఏజెంట్లు కౌంటింగ్ గదిలోకి ప్రవేశించిన తరువాత ప్రక్రియ ముగిసే వరకు బయటకు అనుమతించబోమని పేర్కొన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లోకి తాగునీరు, తినుబండారాలను కూడా అనుమతించబోమని స్పష్టం చేశారు. ఏజెంట్లు కౌంటింగ్ కేంద్రాల వద్ద ఉదయం 7 గంటలకల్లా సిద్ధంగా ఉండాలని సూచించారు. ఏజెంట్లు తమకు కేటాయించిన టేబుల్ వద్ద మాత్రమే కూర్చోవాలని, ఇతర టేబుళ్ల దగ్గరకు, ఇతర నియోజకవర్గాల వద్దకు వెళ్లే అవకాశం లేదని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ తమ గుర్తింపు కార్డును విధిగా ధరించాలని చెప్పారు. ఏదైనా అభ్యంతరం ఉంటే రాతపూర్వకంగా సంబంధిత ఆర్ఓకు లేదా ఎఆర్ఓకు అందజేయాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా ఏజెంట్లు ప్రవర్తిస్తే వారిపై చర్య తీసుకొనే అవకాశం ఆర్ఓలకు ఉందని తెలిపారు. అనంతరం పోస్టల్ బ్యాలెట్ గురించి కలెక్టర్ మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్ కవరులో 13ఎ, 13బి ఫారాలు ఉంటాయని, వాటిపై కచ్చితంగా ఓటరు సంతకంతో పాటు అధికారి సంతకం, హోదా ఉండాలని, లేనిపక్షంలో ఆ ఓటు చెల్లదని వివరించారు. చెల్లిన ఓట్లను ఓట్ల లెక్కింపు పరిగణలోకి తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డిఆర్ఓ కె.మోహన్ కుమార్, ఇతర అధికారులు, పోటీ చేసిన అభ్యర్థులు, పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

2న దుర్గారావు మెమోరియల్ క్రికెట్ టోర్నీ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రెండేళ్ల క్రితం అకాల మరణం చెందిన జర్నలిస్ట్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వ్యవస్థాపక అధ్యక్షులు, కీర్తిశేషులు సోడిశెట్టి దుర్గారావు రెండో వర్ధంతి సందర్భంగా దుర్గారావు 2024 మెమోరియల్ క్రికెట్ టోర్నీని జూన్ 2న నిర్వహిస్తున్నట్లు జేశాఫ్ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వాల్మీకి నాగరాజు తెలిపారు. మంగళవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ టోర్నీకి జాతీయ జర్నలిస్ట్ సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, పెన్ అసోసియేషన్ జర్నలిస్ట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి లోకేష్ కుమార్ సహాయ సహకారాలు అందించారని తెలిపారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ అకాల మరణం చెందిన సోడిశెట్టి దుర్గారావు రెండో వర్ధంతి జూన్ 2న అక్కయ్యపాలెం పోర్ట్ స్టేడియంలో జరుగనుందని, అందులో భాగంగానే క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్నామని, కళాకారుల టీం, ప్రొఫెషనల్ వీడియోగ్రాఫర్స్, ఫొటోగ్రాఫర్స్ టీం, జర్నలిస్టుల టీములు పాల్గొంటాయని అన్నారు. క్రీడాకారులకు అల్పాహారం, భోజన వసతి కల్పించామన్నారు. లెన్స్ హార్ట్ అధినేత వివి.నాయుడు, డాక్టర్ ఫణీందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశామన్నారు.

బెస్ట్ వాల్యూ యూనివర్సిటీ ర్యాంకింగ్‌లో ఎయుకు మెరుగైన స్థానం

ప్రజాశక్తి - విశాఖపట్నం : బెస్ట్ వాల్యూ యూనివర్సిటీ ర్యాంకింగ్స్ ఇన్ ఆసియాలో ఆంధ్రా యూనివర్సిటీకి మెరుగైన స్థానం లభించింది. ఆసియాలోని 20 దేశాలలో 3349 ఉన్నత విద్యాసంస్థలను అధ్యయనం చేసి ఈ స్థానాలను ప్రకటించారు. ఈ క్రమంలో అత్యుత్తమమైన వర్సిటీలలో ఎయు మెరుగైన స్థానంలో నిలిచింది. అకడమిక్ క్వాలిటీ, విద్యా సంబంధిత అంశాలను పరిశీలించి ఈ ర్యాంకింగ్‌ను అందించారు. దీనికి సంబంధించిన అధికారిక ఉత్తర్వులు ఎయుకు అందాయి. వీటిని అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల డీన్ ఆచార్య ఇఎన్.ధనుంజయరావు ఎయు విసి ఆచార్య పివిజిడి.ప్రసాద్‌రెడ్డి సమక్షంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్‌కు అందజేశారు.

స్ట్రాంగ్ రూమ్‌ల తనిఖీలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎయు ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఇవిఎంల స్ట్రాంగ్ రూమ్‌లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ తనిఖీ చేశారు. మంగళవారం ఉదయం స్ట్రాంగ్ రూమ్‌ల వద్దకు వెళ్లిన వారు అక్కడ మూడంచెల భద్రతాపరమైన చర్యలను పరిశీలించారు. అన్ని చోట్లా భద్రతాపరమైన పరిస్థితులు సరిగ్గా ఉన్నాయా లేదా అనే అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ఛాయా చిత్రాల్లో పోర్టు ప్రగతి

విపిటిలో ఆకట్టుకుంటున్న ఆర్ట్ గ్యాలరీ

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

వైజాగ్ పోర్టు ట్రస్ట్ (విపిటి)ది ఎంతో ఘనమైన చరిత్ర. ఇదంతా ఇప్పుడు అబ్బురపరిచే చిత్రరూపంలోకి వచ్చేసింది. దేశంలోనే 12 మేజర్ పోర్టుల్లో సరుకు రవాణాలో వైజాగ్ పోర్టుకు విశిష్ట స్థానం ఉంది. తూర్పు తీరంలోని పోర్టుల్లో రెండో స్థానం దక్కించుకుంది. ఇటీవలే 45 రోజుల్లో 10 మిలియన్ మెట్రిక్ టన్నుల సరుకును రవాణా చేసి 2024-25 ఆర్థిక సంవత్సరంలో రికార్డు నెలకొల్పింది. 73 మిలియన్ టన్నుల నుంచి ఈ ఆర్థిక సంవత్సరంలో 90 మిలియన్ మెట్రిక్ టన్నుల సరుకు రవాణా లక్ష్యంగా సాగుతోంది. ఈ సందర్భంగా పోర్టు సాధిస్తూ వస్తోన్న ప్రగతిపై పోర్టు ఉన్నతాధికారులు పోర్టు ట్రస్ట్‌లో ఒక గ్యాలరీని ఏర్పాటు చేసి 1933 అక్టోబర్ 7న పోర్టు ఆవిర్భావం నుంచి ఇప్పటివరకూ చేపట్టిన ప్రగతిపై 'ఛాయా చిత్ర ప్రదర్శన' ఏర్పాటు చేశారు. పర్యాటకులు, పోర్టుకు విచ్చేసిన వారంతా ఈ ప్రదర్శనను ఆసక్తిగా తిలకిస్తున్నారు.

వైజాగ్ పోర్టు పురోగతి సాగిందిలా..

1933లో మొట్టమొదట నౌక జలదుర్గ 0.33 మిలియన్ టన్నుల సరుకుతో పోర్టుకు విచ్చేసింది. 1957లో 2 ఆయిల్ బెర్తులు కాల్‌టెక్స్ చేసిన డిమాండ్ మేరకు క్రూడ్ పెట్రోలియం ఉత్పత్తుల కోసం నిర్మాణం చేపట్టారు. అవుటర్ హార్బర్‌లో 1976లో రెండు బెర్తుల నిర్మాణం జరిగింది. ఐరన్ ఓర్ రవాణా జరిగింది. 1978లో విశాఖ ఫిషింగ్ హార్బర్ ఫేజ్ 1 పనులు ప్రారంభం అయ్యాయి.

1985లో జనరల్ కార్గో బెర్త్ ఆఫ్ షోర్ ట్యాంకర్ అండ్ టర్మినల్ అవుటర్ హార్బర్‌లో స్థాపించారు. 2000లో అవుటర్ హార్బర్‌లో గల ఎల్‌పిజి టర్మినల్ బెర్తు నిర్మాణం చేపట్టారు. 2003లో కంటైనర్ వెస్సెల్ 47.74 మిలియన్ టన్నుల నౌక విచ్చేసింది. 2004లో ఈక్యూ 8, ఈక్యూ 9 ఇన్నర్ హార్బర్‌లో బిఒటి ప్రాతిపదికన బెర్తులను పోర్టు అభివృద్ధి చేసింది. 2006లో పోర్టు కనెక్టివిటీ రోడ్డు నేషనల్ హైవేకు అనుసంధానం చేశారు. 2011లో సింగిల్ పాయింట్ మూరింగ్ (ఎస్‌పిఎం)ను కమిషనింగ్ చేశారు. అవుటర్ హార్బర్‌లో ఈ సంవత్సరంలో 67.42 మిలియన్ టన్నులు కార్గో చేశారు. 2013లో మెకనైజ్డ్ కోల్ హ్యాండ్లింగ్ సౌకర్యంగల బెర్తును జనరల్ కార్గో బెర్త్ వద్ద పోర్టు అభివృద్ధి చేసింది. 2018లో 66 మిలియన్ టన్నుల కార్గోను పోర్టు చేసింది. ఈ సంవత్సరం రెండు పానమాక్స్ కెపాసిటీ బెర్తులు వెస్ట్ క్యూ 7, 8లను ఇన్నర్ హార్బర్‌లో పోర్టు అభివృద్ధి చేసింది.

2020లో కాన్వెంట్ జంక్షన్ బై పాస్ రోడ్డు కనెక్టివిటీ కోసం గ్రేడ్ సెపరేటర్ నిర్మాణాన్ని పోర్టు చేపట్టింది. 2023లో 80.09 మిలియన్ మెట్రిక్ టన్నుల కెపాసిటీ కార్గోకు పోర్టు చేరడం, దేశంలోని 12 మేజర్ పోర్టుల్లో క్లీనెస్ట్ పోర్టుగా అవార్డును సొంతం చేసుకోవడం పోర్టు చరిత్రలో మరువలేనివి.

అదే సంవత్సరం వైజాగ్ ఇంటర్నేషనల్ క్రూయిజ్ టర్మినల్ భవనాన్ని పోర్టు ప్రారంభించింది. 2024లో వైజాగ్ పోర్టు దేశంలోని మేజర్ పోర్టుల్లో ఆల్ టైం రికార్డు జనరల్ కార్గో టన్నేజ్ 81.09 మిలియన్ టన్నుల కార్గోను సాధించింది. 90 ఏళ్లలో అద్భుత ప్రగతితో పోర్టు దూసుకువెళ్లడం నిజంగా రికార్డు. ఆ విశేషాలన్నీ ఛాయాచిత్రాల్లో మనకు కనిపిస్తాయి.

పారదర్శకంగా కౌంటింగ్ ప్రక్రియ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికారులు సన్నద్ధం కావాలని విశాఖ తూర్పు రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో విశాఖ తూర్పు పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ నిర్వహణకు అవసరమైన సదుపాయాలు, వివిధ బృందాలు ఏర్పాటు, చేయవలసిన విధులకు సంబంధించి అధికారులకు అవగాహన కల్పించి, సిబ్బందికి పలు ఆదేశాలు జారీ చేశారు. జూన్ 4న ఉదయం 8 గంటలకు ఆంధ్రా యూనివర్సిటీ న్యూ క్లాస్ రూమ్ కాంప్లెక్స్ మొదటి అంతస్తులో తూర్పు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందని, ముందస్తుగా పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ఉంటుందని అన్నారు. 8వ నెంబరు గదిలో అసెంబ్లీ, 9వ నెంబరు గదిలో పోస్టల్ బ్యాలెట్, 10వ నెంబరు గదిలో పార్లమెంట్ ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరుగుతుందన్నారు. అసెంబ్లీ కౌంటింగ్ హాల్ నందు 14 కౌంటింగ్ టేబుల్స్, పార్లమెంట్ హాల్ నందు 16 టేబుల్స్ లెక్కింపు కోసం ఏర్పాటు చేశామన్నారు. ప్రతి టేబుల్ వద్ద కౌంటింగ్ సూపర్‌వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్, మైక్రో అబ్జర్వర్ ఒక బృందంగా విధులు నిర్వహిస్తారన్నారు. స్ట్రాంగ్ రూమ్ నుంచి కౌంటింగ్ హాల్‌కు ముందస్తుగా కంట్రోల్ యూనిట్లను హమాలీలు తీసుకుని వస్తారని వారికి డ్రెస్ కోడ్ ఉంటుందని అన్నారు. స్ట్రాంగ్ రూములు పోటీ అభ్యర్థులు, ఏజెంట్లు సమక్షంలో తెరవాలని స్పష్టం చేశారు. కౌంటింగ్ నిర్వహించే సమయంలో అధికారులు, సిబ్బంది నిబంధనలను గుర్తించుకోవాలని, ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలను పాటించాలని కోరారు. కార్యక్రమంలో సహాయక రిటర్నింగ్ అధికారులు, కౌంటింగ్ సూపర్‌వైజర్లు, సహాయకులు, మైక్రో అబ్జర్వర్లు, ట్యాబ్యులేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

కౌంటింగ్ ఏర్పాట్ల పరిశీలన

ఎంవిపి.కాలనీ : కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించి ఎయు ఇంజినీరింగ్ కళాశాల పరిధిలో జరుగుతున్న ఏర్పాట్లను పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్‌తో కలిసి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున మంగళవారం ఉదయం పరిశీలించారు. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గం, పార్లమెంటు నియోజకవర్గానికి సంబంధించి జరుగుతున్న ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు.

ఎన్‌టిఆర్ చిత్ర గీతాలతో..

అలరించిన సంగీత విభావరి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఎన్‌టిఆర్ 101వ జయంతిని పురస్కరించుకొని డాబాగార్డెన్స్ సమీపంలోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆద్యంతం అలరించింది. ఊహలు గుసగుసలాడే శీర్షికన 'శ్రీదేవి మహానటి సంగీత సంస్థ' నిర్వహణలో జరిగిన ఈ సంగీత విభావరిలో ఎమ్మెస్ మాధవ్, మద్దిల అప్పారావు, సుధీర్, రమణి పాడిన గీతాలు హుషారెక్కించాయి. సంస్థ వ్యవస్థాపకులు జెఎమ్ఆర్.నెహ్రూ నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమాన్ని గాయని శ్రీదేవికి అంకితమిస్తూ నగరానికి చెందిన గాయనీ గాయకులు పలు గీతాలు ఆలపించి అలరించారు. కార్యక్రమాన్ని సోషల్ మీడియా స్టేట్ చైర్మన్ సన్ మూర్తి, వ్యాఖ్యాత పి.రాజేంద్రప్రసాద్, ఆధ్యాత్మికవేత్త ఎంవి.రాజశేఖర్, సంఘ సేవకురాలు విజయరమణి, సంస్థ కోశాధికారి రమణి, గౌరవ అధ్యక్షురాలు కందర్ప రాధ తదితరులు సమన్వయపరిచారు. ఈ సందర్భంగా సన్ మూర్తి మాట్లాడుతూ కళాకారులకు ఎన్‌టిఆర్ నిత్య స్ఫూర్తి అన్నారు. ఆయన నటనను ఎందరో అనుకరించి నేడు పెద్ద హీరోలుగా రాణిస్తున్నారని పేర్కొన్నారు. రాజకీయ రంగంలోనూ ఎన్‌టిఆర్ ఒక ప్రభంజనాన్ని సృష్టించి గుర్తింపును సంపాదించుకున్నారన్నారు. తెలుగు జాతి గర్వించదగ్గ మహోన్నత వ్యక్తి ఎన్‌టిఆర్ అని కొనియాడారు. కార్యక్రమంలో అడ్వకేట్ శైలజ, అమ్మాజీరావు, అప్పారావు, డాక్టర్ విజయకుమార్ తదితరులు పాల్గొని కళాకారులను అభినందించారు.



ఎన్‌టిఆర్ చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న గాయనీ గాయకులు

ప్రయాణికులకు ప్రయాస!

తగరపువలస జంక్షన్ వద్ద ఆరు లైన్ల జాతీయ రహదారి

6 లైన్ల రహదారితో కష్టాలు
బస్సుల కోసం పడిగాపులు
స్టాప్‌కు వెళ్లాలంటే డివైడర్లు దాటాల్సిందే

ప్రజాశక్తి -తగరపువలస

జాతీయ రహదారుల విస్తరణ తర్వాత ప్రయాణికులకు కొత్త కష్టాలు వచ్చాయి. వేంకటేశ్వరమెట్ట, జీడి పప్పుల దుకాణాల వద్ద బస్సుల కోసం వచ్చే ప్రయాణికులు అనేక అగచాట్లకు గురవుతున్నారు. విశాఖ నుంచి విజయనగరం, శ్రీకాకుళం వైపు వెళ్లే బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులకు గతంలో అన్ని బస్సులు అందుబాటులో ఉండగా, ఫ్లై ఓవర్ నిర్మాణం తర్వాత సర్వీస్ రూట్‌లో వచ్చే బస్సులు కొన్నింటికి పరిమితమయ్యాయి. వేంకటేశ్వరమెట్ట వద్ద బస్ ఎక్కాలన్నా, దిగాలన్నా నిత్యం వాహన రద్దీతో ఉండే నాలుగు లైన్ల రహదారి దాటాలంటే ప్రమాద భరిత సాహసమేనని చెప్పక తప్పదు. తగరపువలసలో దిగే ప్రయాణికులు ఉంటేనే తప్ప బస్సులు ఆగని పరిస్థితి ఉందని స్థానికులు వాపోతున్నారు. వెంకటేశ్వర మెట్ట వద్ద బస్ షెల్టర్ ఉన్నా, జీడి పప్పు దుకాణాల వద్ద బస్ స్టాప్ లేక పోవడంతో ఎండ, వానల్లో ఆరు బయటే పడిగాపులు పడాల్సిందే.

షెల్టర్ ఒక చోట.. బస్సులు నిలిపేది మరో చోట..

ఆరు లైన్ల జాతీయ రహదారి విస్తరణ ఎవరి ప్రయోజనాల కోసమనే విమర్శలు వినిపిస్తున్నాయి. విజయ నగరం, శ్రీకాకుళం వెళ్లే ప్రయాణికులు వేంకటేశ్వరమెట్ట బస్ షెల్టర్ వద్ద 6వ లైన్ రోడ్డు వద్ద వేచి యుంటే, ఫ్లై ఓవర్‌పై
వచ్చేవన్నీ 5వ లైన్‌లోకి వచ్చి పోతుంటాయి. దీంతో బస్సుల కోసం ప్రయాణికులు ఎదురు చూసి, గత్యంతరం లేక ప్రైవేట్ వాహనాల్లో వెళ్తున్నారు.

జంక్షన్‌కు రావాలంటే అవస్థలే..

స్థానిక జంక్షన్ నుంచి అటు వెంకటేశ్వర మెట్ట, ఇటు జీడి పప్పుల దుకాణాల వద్దకు బస్సుల కోసం వెళ్లాలన్నా, అక్కడ బస్సు దిగి జంక్షన్‌కు రావాలన్నా ప్రయాణికులకు నానా అవస్థలు తప్పడం లేదు. సుమారు రెండు కిలోమీటర్లకు పైగా దూరం వెళ్లాల్సి ఉంటుంది. కాస్తో కూస్తో లగేజీ ఉన్నా, లేకుంటే చిన్న పిల్లలు, మహిళలు, వృద్ధులు ఉంటే వారు పడే ఇబ్బందులు వేరే చెప్పనక్కరలేదు. ఇక మండు టెండల్లోనైనా, వర్షం కురిసినప్పుడైనా అంత దూరం వెళ్లడం ప్రయాణికులకు ఇబ్బంది కరమే.

ముందు చూపు లేక పోవడం వల్లే..

జాతీయ రహదారి అభివృద్ధి సమయంలో అన్ని కూడళ్లను ఒకే విధంగా పరిగణించకుండా, స్థానిక పరిస్థితులను బట్టి పనులు చేపడితే ప్రజలకు కొత్త కష్టాలు వచ్చేవి కాదనడానికి తగరపువలసలోని పరిస్థితులే నిదర్శనం. ఇక్కడ ముందు చూపు లేకుండా చేపట్టిన పనుల వల్లనే ఇలాంటి ఇబ్బందులని స్థానికులు చెబుతున్నారు.

జంక్షన్ మీదుగా బస్సులు నడపాలి

తగరపువలస జంక్షన్‌లో నుంచి ఆర్‌టిసి బస్సులు నడిపితే ప్రయాణికులకు సౌలభ్యంగా ఉంటుంది. ఆర్‌టిసికి ఆదాయం కూడా వస్తుంది.

రవ్వ నరసింగరావు
సిఐటియు నాయకులు
తగరపువలస

అవస్థలు పడుతున్నాం

తగరపువలస జంక్షన్‌లోకి ఆర్‌టిసి ఎక్స్‌ప్రెస్, సాధారణబస్సులు రాక పోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. శ్రీకాకుళం, విజయనగరం వైపు వెళ్లాలంటే అటు జీడి పప్పులదుకాణాలు, ఇటు వెంకటేశ్వరమెట్ట వద్దకు వెళ్లాలంటే రెండు కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లక తప్పడం లేదు.

పిల్లా కనకరాజు
తగరపువలస

గణితం పరీక్షకు 841 మంది గైర్హాజరు

ప్రజాశక్తి - ఆరిలోవ : పదోతరగతి సప్లమెంటరీ పరీక్షల్లో భాగంగా మంగళవారం జరిగిన గణితం పరీక్షకు 841 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు విశాఖ జిల్లా విద్యాశాఖాధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 20 పరీక్షా కేంద్రాల్లో 2242 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకావలసి ఉండగా 1401 మంది హాజరైనట్లు పేర్కొన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ రెండు పరీక్షా కేంద్రాలను, స్క్వాడ్ బృందాలు 16 కేంద్రాలను సందర్శించారని వివరించారు. పరీక్షా కేంద్రాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని డిఇఒ చంద్రకళ తెలిపారు.

పౌష్టికాహార పదార్థాల ప్రదర్శనను తిలకిస్తున్న ఏడీ జ్యోతి, ఎంఇఒలు శివరాణి, జయప్రద

మండల స్థాయి వంటల పోటీలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక యుపి పాఠశాలలో మండల స్థాయి వంటల పోటీలు మంగళవారం నిర్వహించారు. పిఎం పోషన్, గోరు ముద్ద కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ పోటీల్లో వివిధ రకాల వంటలు రుచి గాను, శుచిగాను ఉన్నాయి. విద్యార్థులకు పౌష్టికాహారం ఎలా ఇవ్వవచ్చనేది ఆచరణాత్మకంగా వివిధ పదార్థాలు వండి వడ్డించారు. వండిన అన్నం, పులిహోర, పప్పు, గోంగూర, సాంబారు తదితరాలను ప్రదర్శించారు. జిల్లా విద్యా శాఖ స్కీమ్స్ ఏడీ ఎఎ జ్యోతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమం ప్రాధాన్యతను వంట చేసే మహిళలకు, సహాయకులకు వివరించారు. వంటల తయారీలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు 1,2 ఎం.శివ రాణి, జయప్రద, పాఠశాల హెచ్ఎం జయసుధ, పిఎన్ఎం ప్రాథమిక పాఠశాల హెచ్ఎం సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఆటోస్టాండ్ లేక అవస్థలు
హైవే రోడ్డుపైనే ఆటోలు నిలుపుదల

ప్రజాశక్తి -దుంబ్రిగుడ: మండలంలోని కించుమండలో ఆటోలు నిలుపుదలకు పార్కింగ్ స్థలం లేకపోవడంతో అటోడ్రైవర్లు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఆటోస్టాండ్ స్థలం లేకపోవడంతో 516ఇ హైవే రోడ్డుపైనే ఆటోలు నిలుపుదల చేస్తుండటంతో అక్కడ వాహన రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. స్థానిక మండలంలోని కించుమండ, కుర్ర, కితలంగి పంచాయతీ గ్రామాలతో పాటు హుకుంపేట గత్తుం, బొడ్డపూటు, రంగశీల, పట్టం, వెంగడ ప్రాంత పంచాయతీ గ్రామాలు, అనంతగిరి మండలాలకు చెందిన పలు ప్రాంతాల పంచాయతీ గిరిజనులు నిత్యం కించమండకు వచ్చి నిత్యవసర వస్తువులు కొనుగోలు చేయడంతో పాటు వివిధ పనుల నిమిత్తం రాకపోకలు చేస్తుంటారు. మారుమూల గిరిజన గ్రామాలు కావడంతో రోడ్డు సౌకర్యం ఉన్నప్పటికీ, ఆర్‌టిసి బస్సు సౌకర్యం కల్పించకపోవడంతో ఆ ప్రాంతాల గిరిజనులు ఆటోలోని ప్రయాణాలు సాగిస్తున్నారు. అవన్నీ కించమండలో నిలుపుదల చేస్తున్నారు. అయితే అక్కడ స్థలం లేకపోవడంతో రోడ్డుపైనే నిలిచో పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆటో డ్రైవర్లు అంటున్నారు. కించుమండలో స్టేట్ బ్యాంక్ ఉండటంతో బ్యాంకు లావాదేవీలకు వచ్చేవారు నిత్యం ఉంటూనే ఉంటారు. ప్రతి బుధవారం వారపు సంతకు అధిక శాతం గిరిజనులు, వాహనాలు రాకపోకలు చేస్తుండడంతో అక్కడ రద్దీ ఏర్పడుతుందని, తద్వారా ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందని పలువురు ఆటో డ్రైవర్లు అంటున్నారు.

గ్రంథాలయాల్లో ఉత్సాహంగా సమ్మర్ క్యాంపులు

కథల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ప్రజాశక్తి-యంత్రాంగం

శాఖా గ్రంథాలయాల్లో ఉత్సాహంగా సమ్మర్ క్యాంపులు సాగుతున్నాయి. మంగళవారం పిల్లలకు నీతి కథలను బోధించారు.

భీమునిపట్నం : స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు నీతి కథలు బోధించారు. డ్రిల్ నిర్వహించారు. శాఖా గ్రంథాలయాధికారి మహేష్ పాల్గొన్నారు.

ములగాడ : మల్కాపురంలోని శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం కథలను వినిపించారు. ప్రముఖ కార్మిక నాయకులు బి.సత్యానందం మానవతా విలువలకు సంబంధించిన కథలను చెప్పారు. అనంతరం జాతీయ సేవా పథకం వాలంటీర్ హర్షితారాణి ఆధ్వర్యాన చిన్నారులకు నృత్యం నేర్పించారు. చిన్నారులకు అనేక ఆటల పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రామ్ అధికారి ఇపిఎస్.భాగ్యలక్ష్మి, ప్రముఖ రచయిత కె.సత్తిరాజు, గ్రంథాలయాధికారి వి.అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

చీడికాడ : స్థానిక శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా చిన్నారులతో సృజనాత్మకత పెంచేందుకు మెదడుకు మేత పెట్టే ఆటపాటలు, కథలు నిర్వహిస్తున్నామని లైబ్రేరియన్ ఎంఎస్ఎల్.జోగేశ్వరి తెలిపారు. మంగళవారం విద్యార్థులకు చిన్నారులకు చిట్టి కథలు చెప్పడంతోపాటు మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహించారు. విజేతలకు ముగింపు రోజున బహుమతులిస్తామని జోగేశ్వరితెలిపారు.

నక్కపల్లి :మండలంలోని చినదొడ్డుగల్లు గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి కె.జనార్ధన్ ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం విద్యార్థులకు మ్యూజికల చైర్ పోటీలు నిర్వహించారు. ఆంగ్ల ఉపాధ్యాయులు వెంకటరమణ ఈ పోటీలను పర్యవేక్షించారు. ముగింపు రోజున విజేతలకు బహుమతులు అందజేస్తామని లైబ్రేరియన్ జనార్ధన్ వెల్లడించారు.

కోటవురట్ల : స్థానిక శాఖా గ్రంథాలయంలో మంగళవారం గ్రంథాలయఅధికారి అప్పలనాయుడు ఆధ్వర్యంలో విద్యార్థులకు బుక్ రీడింగ్‌పై అవగాహన కల్పించారు. సెల్‌ఫోన్లు, టీవీలకు అతుక్కుపోకుండా పిల్లలు మంచి పుస్తకాలను చదవాలని, శారీరక శ్రమనిచ్చే ఆటలాడాలని, పరిసరాల పరిశుభ్రతతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. హ్యాండ్ వాషింగ్‌పై అవగాహన కల్పించారు. ఆశ వర్కర్లు విద్యార్థులు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్ : స్థానిక శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి పి.దమయంతి ఆధ్వర్యంలో మంగళవారం సమ్మర్ క్యాంపులో వివిధకార్యక్రమాలు నిర్వహించారు. రిసోర్స్ పర్సన్ ఎస్.పద్మ డబ్ల్యూహెచ్‌లతో వచ్చే పదాలు అడిగి వాటిని ఎక్కడ, ఎలా ఉపయోగించాలో వివరించారు. విశ్రాంత గ్రేడ్ 1 గ్రంథాలయాధికారి జీ.మురళీకృష్ణ తెలుగు పద్యాలు, భావాలు, పదాలు, వ్యతిరేకపదాలు, సామెతలు పిల్లల చేత చెప్పించారు. బలిఘట్టం జెడ్‌పిహెచ్ఎస్ పాఠశాల క్రాఫ్ట్ ఉపాధ్యాయురాలు కె.రాజేశ్వరి పేపర్ ఫ్లవర్స్ ఎలా చేయాలో చేసి చూపించారు. కార్యక్రమంలో 35 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

మునగపాక : స్థానిక శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో మంగళవారం విద్యార్థులకు దేశ నాయకుల జీవిత చరిత్రలు, నీతి కథల ప్రాధాన్యత, జికెపై ఉపాధ్యాయులు గణేష్ అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు వివిధ రకాలైన ఆటలను నిర్వహించారు. గ్రంథాలయాధికారి ఎల్వి రమణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

నర్సీపట్నంలో హాజరైన విద్యార్థులు

మునగపాకలో...

పిఎఫ్ కార్యాలయం వద్ద పెన్షనర్లు

హయ్యర్ పెన్షన్ వర్తింపజేయాలి

ప్రజాశక్తి -కరాస: హయ్యర్ పెన్షన్‌పై పిఎఫ్ అధికారులు వెంటనే నిర్ణయం తీసుకొని కార్మికులకు మేలు చేయాలని ఎపి రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు డిమాండ్‌చేశారు. ఈ మేరకు మంగళవారం పిఎఫ్ కమిషనర్‌ను కలిసి హయ్యర్ పెన్షన్‌పై చర్చించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు కె.సుధాకర్ మాట్లాడుతూ, సుప్రీంకోర్టు తీర్పు ఇపిఎఫ్ -95 పెన్షనర్లకు శరాఘాతంగా మారిందన్నారు. ఈ తీర్పు ద్వారా హయ్యర్ పెన్షన్ అమలు చేయకుండా అనేక కుంటి సాకులు చూపించి కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ఇంతవరకు షిప్‌యార్డ్, బిహెచ్‌ఇఎల్ ఉద్యోగులకు ఎటువంటి నోటీసులూ అందలేదని తెలిపారు. కొంతమందికి నోటీసులు అంది దాదాపు నాలుగు వందల కోట్లు పిఎఫ్ ఆఫీస్‌లో జమ చేసి ఐదు నెలలు అవుతున్నా ఇంతవరకు ఎలాంటి సమాచారం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం నాయకులు కుమారమంగళం, ఎస్‌కె.హుస్సేన్, కెపి.కుమార్, సిహెచ్.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా దుర్గమాంబ పండగ

ప్రజాశక్తి-యంత్రాంగం

సీతమ్మధార : గొల్ల కంచరపాలెం దుర్గానగర్‌లో దుర్గమాంబ అమ్మవారి పండగను వేడుకగా నిర్వహించారు. అమ్మవారిని ఉత్తర నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, రత్నాకర్, గ్రామ అధ్యక్షులు పల్లా సత్యనారాయణ, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

వేపగుంట : గొల్ల కంచరపాలెం దుర్గానగర్‌లోని దుర్గాలమ్మ అమ్మవారి పండగ ఉత్సవాల్లో నగర డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు మంగళవారం అమ్మవారిని ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజ కార్యక్రమంలో శ్రీధర్ పాల్గొన్నారు. పండుగ సందర్భంగా దుర్గానగర్ గ్రామస్తులందరికీ ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు ఆయనను సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

92వ వార్డులో దుర్గమ్మ పండగ

పెందుర్తి: జివిఎంసి 92వ వార్డు పరిధి బంటాకాలనీలో దుర్గమ్మ పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమలతో మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు ప్రసాదం వితరణ చేపట్టారు. భక్తులు సహకారంతో ఈ పండగను ఏటా ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. సాయంత్రం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

రద్దీ ఎక్కువ.. సౌకర్యాలు తక్కువ...

- చాలీచాలని స్టాళ్లు
- పార్కింగ్‌కు లేని స్థలం
- ఇదీ సీతమ్మధార రైతుబజార్ దుస్థితి

ప్రజాశక్తి-సీతమ్మధార : నగరంలోని అతిపెద్ద రెండో రైతు బజారుగా ఉన్న సీతమ్మధార రైతు బజారులో వినియోగదారులకు వాహనదారులకు తిప్పలు తప్పడంలేదు. నిత్యం రద్దీగా ఉండే ఈ రైతుబజార్‌లో స్టాళ్ల తక్కువగా ఉన్నాయి. వినియోగారులు వాహనాలను పెట్టుకునేందుకు పార్కింగ్ స్థలం కూడా లేకపోవడంతో వారంతా ఇబ్బందులు పడుతున్నారు. హెచ్‌బి.కాలనీ, సీతంపేట, బాలయ్యశాస్త్రి లే-అవుట్, సీతమ్మధార, గణేష్‌నగర్, రేసపువానిపాలెం, బృందావనంకాలనీ, కనకమ్మ వారి వీధి, గురుద్వారా, 60 అడుగులు రోడ్డు ప్రాంతం, బిఎస్‌ఎన్‌ఎల్ క్వార్టర్స్ తదితర ప్రాంతాలకు సీతమ్మధార రైతు బజారు అనువుగా ఉంటుంది ఈ రైతు బజార్లో వినియోగం కూడా చాలా ఎక్కువగా ఉంటుంది. ప్రజలు ఎక్కువగా రావడంతో వినియోగం ఎక్కువ శాతంలో ఉంటుంది. అయితే రైతు బజార్‌కు వచ్చేవారు వాహనాలు నిలుపుటకు సరైన ప్రదేశం లేకపోవడంతో రోడ్డుపై పార్కింగ్ చేయవలసిన పరిస్థితి ఏర్పడింది. ఈ రహదారిలో ప్రయాణించే వాహనదారుల సంఖ్య చాలా ఎక్కువగా ఉంటుంది. ఇక్కడ రోడ్డు దాటాలన్నా భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా వికలాంగులు, వృద్ధులు, మహిళలు రోడ్డు దాటాలంటే ముప్పుతిప్పలు పడుతున్నారు. కొన్ని సందర్భాల్లో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. పార్కింగ్ కోసం స్థలం కేటాయించాలని పలుమార్లు జివిఎంసికి, ట్రాఫిక్ పోలీసులకు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడంలేదు.

సీతమ్మధార రైతుబజార్‌ను 300 మంది రైతులు వినియోగిస్తున్నారు. ఉదయం పూట 200 మంది, సాయంత్రం పూట 100 మంది రైతులకు కేటాయించారు.

స్టాల్ లేక నేల మీదే కూరగాయలు విక్రయిస్తున్న రైతులు

స్టాళ్ల కొరత విపరీతంగా ఉండడంతో రైతులు నేల మీద వ్యాపారం చేస్తున్నారు. స్టాళ్ల లేక ఎండకి వానకి తడుస్తూ ఆరుబయట కూరగాయలు విక్రయించాల్సి వస్తోంది. కూరగాయలు నిల్వ చేసుకునే విధంగా స్టోరేజీ కూడా లేకపోవడంతో పాడైపోతున్నాయని రైతులు పలుమార్లు రైతు బజార్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందనలేదు. గతంలో ఎమ్మెల్యేగా ఉన్న విష్ణుకుమార్‌రాజు అదనంగా రెండు ఫ్లోర్లు నిర్మించడానికి ప్రపోజల్ పెట్టినా ఇంతవరకు అతీగతీలేదు. రైతు బజార్‌కు ఆదాయం ఎక్కువగానే ఉంటుంది. కమర్షియల్‌కు 29 షాపులు కేటాయించారు. ఒక్కోషాపు నుంచి రూ.2500 నుంచి రూ.15 వేలు వరకు వసూళ్లు చేస్తున్నారు. హోల్‌సేల్‌గా విక్రయించే రైతులు 65 మంది నుంచి రూ.3000 చొప్పున వసూలు చేస్తున్నారు. మొత్తం మీద నెలకు రూ.6.15 లక్షల ఆదాయం వస్తోంది. ఇంత ఆదాయం వస్తున్నా రైతుబజార్‌ను మరింత అభివృద్ధి చేసేందుకు మాత్రం అధికారులు ముందుకు రావడంలేదు. దీంతో రైతు బజార్లో రైతులతో పాటు కొనుగోలుదారులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ చూపించి రైతు బజార్‌కు అదనపుగా రెండు అంతస్తుల నిర్మాణం, వాహనదారులకు పార్కింగ్ సదుపాయాలు కల్పించాలని పలువురు కోరుతున్నారు.

రైతుబజార్‌లో సమస్యలపై ఈవో కొండబాబును ప్రజాశక్తి ప్రశ్నించగా రైతు బజార్‌కు అదనంగా రెండంతస్తుల నిర్మాణం, పార్కింగ్ స్థలం కేటాయింపు ఉన్నతాధికారుల దృష్టిలో ఉందని తెలిపారు. త్వరలోనే నిర్మించే అవకాశముందని చెప్పారు. స్టాళ్ల కొరత ఉండటంతో కొంతమంది రైతులు నేల మీదే విక్రయించాల్సిన పరిస్థితి ఉందని ఆయన తెలిపారు.

31న లైబ్రేరియన్ నాగరాజు ఉద్యోగ విరమణ

ప్రజాశక్తి -పద్మనాభం : మండల కేంద్రమైన పద్మనాభంలో ఉన్న శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్‌గా పనిచేస్తున్న ఊసా నాగరాజు ఈ నెల 31న ఉద్యోగ విరమణ చేస్తున్నారు. మచిలీపట్నం సమీపంలో ఉన్న పోలవరం వీరి స్వగ్రామం. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చారు. తండ్రి సుధాకరరావు, తల్లి కామేశ్వరమ్మకు ప్రథమ సంతానంగా 1962 మే 5న నాగరజాఉ జన్మించారు. నాగరాజు మూడు నెలల వయసున్నప్పుడే బతుకు తెరువు కోసం ఆ కుటుంబం విశాఖపట్నం వలస వచ్చారు. నాగరాజుకు ఒక చెల్లి, ఇద్దరు తమ్ముళ్లు ఉన్నారు. 1968లో విశాఖపట్నం పోర్టు స్కూల్లో ఒకటవ తరగతిలో చేరారు. 10వ తరగతి వరకు అక్కడే విద్యాభ్యాసం కొనసాగించారు. 1981లో విశాఖపట్నంలోని కృష్ణా కాలేజీలో ఇంటర్, ఇంకా ఆపై చదువులు కొనసాగించారు. 1986లో ఉన్నత చదువులను పూర్తి చేసుకున్నారు. 1990లో పోలవరం గ్రామానికి చెందిన పద్మతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు మగ పిల్లలు. 1999లో జిల్లా గ్రంథాలయంలో అటెండర్‌గా ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. 2011లో లైబ్రేరియన్‌గా ప్రమోషన్ పొందారు. పలు ప్రాంతాల్లో లైబ్రేరియన్‌గా పనిచేశారు. ఏడాది క్రితం బదిలీపై పద్మనాభం లైబ్రేరియన్‌గా వచ్చారు. శాఖ గ్రంథాలయలో ఈ నెల 31న ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

ప్రశాంత కౌంటింగ్‌కు సహకరించండి : కలెక్టర్

ప్రజాశక్తి-పాడేరు : వచ్చేనెల 4న జరగనున్న ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించడానికి అందరు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలక్టర్ ఎం. విజయసునీత విజ్ఞప్తి చేశారు. మంగళవారం కలక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, పోటీలో ఉన్న అభ్యర్థులతో నిర్వహించిన సమావేశంలో కలక్టర్ మాట్లాడుతూ, ఫారం 18 ద్వారా కౌంటింగ్ ఏజెంట్‌ను నియమించి గుర్తింపు కార్డుతో కౌంటింగ్ కేంద్రానికి పంపించాలని సూచించారు. కౌంటింగ్ సిబ్బంది, ఏజంట్లు ఎవ్వరికీ మొబైల్స్, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు గాని తీసుకెళ్లేందుకు అనుమతి లేదని స్పష్టం చేశారు. అరకు, పాడేరు అసెంబ్లీ నియోజకవర్గాలకు, అరకు పార్లమెంటుకు సంబంధించి అరకు, పాడేరు సెగ్మెంట్ల కౌంటింగ్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేయడం జరిగిందని అదేవిధంగా రంపచోడవరం నియోజకవర్గం మరియు అరకు పార్లమెంట్ సెగ్మెంట్‌కు సంబంధించి రంపచోడవరం జూనియర్ కళాశాలలో కౌంటింగ్ ఏర్పాటు చేశామన్నారు. కౌంటింగ్‌కు 14 టేబుల్స్ ఏర్పాటు చేశామని, అరకులో 304 పోలింగ్ కేంద్రాలకు 22 రౌండ్లు లెక్కింపు ఉంటుందన్నారు. పాడేరులో 318 పోలింగ్ కేంద్రాలకు 23రౌండ్లు లెక్కింపు ఉంటుందని, రంపచోడవరంలో రౌండుకు 20 టేబుల్స్ ఏర్పాటు చేసినందున 399 పోలింగ్ కేంద్రాలకు 20 రౌండ్లు లెక్కింపు ఉంటుందని వివరించారు. కౌంటింగ్‌లో సమస్యలు తలెత్తడానికి గల అవకాశాలను, పరిష్కారాలను కలక్టర్ ఈ సందర్భంగా రాజకీయ పార్టీల ప్రతినిధులకు అవగాహన కల్పించారు.

రహదారులపై లారీల పార్కింగ్

పట్టించుకోని ట్రాఫిక్ అధికారులు

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక నియోజకవర్గం పరిధిలో నిత్యం రద్దీగా ఉండే గాజువాక 100 అడుగుల రోడ్డు, షీలానగర్, స్వతంత్రనగర్ ప్రాంతాల్లో లారీలు 24 గంటలూ పార్కింగ్ చేయడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. గాజువాక 100 అడుగుల రోడ్డులో రెవిన్యూ, జివిఎంసి జోనల్ కార్యాలయం, కోర్టు, పోలీస్ స్టేషన్, స్కూలు, హాస్పిటల్స్ ఉన్నాయి. దీంతో రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. అలాంటి రోడ్డుపై అదాని గంగవరం పోర్టుకు చెందిన లారీలు పార్కింగ్ చేస్తున్నారు. రోడ్డుకు సగం వరకు వాహనాలను పార్కింగ్ చేయడంతో కార్లు, ద్విచక్రవాహనాలపై వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలు సందర్భాల్లో వాహనదారులు వాటిని ఢీకొని ప్రమాదాలు గురవుతున్నారు. గతంలో లారీలను తొలగించిన పోలీసు అధికారులు ఇప్పుడు పట్టించుకోకపోవడంతో ఇష్టానుసారంగా రోడ్లపై పార్కింగ్ చేస్తున్నారు.

షీలానగర్ సర్వీస్ రోడ్డులో భారీ సంఖ్యలో లారీలు పార్కింగ్ చేస్తున్నారు. సర్వీస్ రోడ్డు నుంచి జాతీయ రహదారికు వచ్చే సమయంలో భారీ ప్రమాదాలు జరుగుతున్నాయి. సర్వీస్ రోడ్డు మీదుగా ద్విచక్ర వాహనాలు రావడానికి వీలు లేని విధంగా పార్కింగ్ చేయడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. స్వతంత్రనగర్ పోర్టు రహదారిలో వాహనాలు పార్కింగ్ చేయడంతో స్వతంత్ర నగర్, రిక్షా కాలనీ, నడుపూరు వెళ్లే ప్రజల ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయంలో లారీ డ్రైవర్లు మద్యం తాగి రోడ్లపైన వీరంగం చేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. వీటి పట్ల పోలీసులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

దీనిపై గాజువాక ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావును వివరణ కోరగా ఆ రహదారులను పరిశీలించి, రోడ్లపై పార్కింగ్ లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. తమ దృష్టికి వచ్చిన వాటిపై చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

వంద అడుగుల రోడ్డుపై పార్కింగ్ చేసిన లారీలు

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పలు రంగాల్లో అభివృద్ధి

ప్రజాశక్తి-అనకాపల్లి

ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్ ద్వారా పలు రంగాల్లో అభివృద్ధి సాధించవచ్చని దాడి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (డైట్) కళాశాల కరస్పాండెంట్ దాడి రత్నాకర్ పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్ ద్వారా కంప్యూటర్ విజన్, మెడికల్ ఇమేజింగ్, బయోమెట్రిక్ సెక్యూరిటీ అప్లికేషన్స్ ఉపయోగాలపై ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం ఎలక్ట్రానిక్స్ అండ్ ఐసిటి అకాడమీ, ఎన్ఐటి వరంగల్, డైట్ సంయుక్త సహకారంతో ఆన్లైన్ ద్వారా ఈనెల 27 నుంచి జూన్ 3 వరకు నిర్వహిస్తున్నారు. భారత ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ ఆర్థిక సహాయంతో నిర్వహించే ఈ కార్యక్రమంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్ ద్వారా కంప్యూటర్ విజన్, మెడికల్ ఇమేజింగ్, బయోమెట్రిక్ సెక్యూరిటీ అప్లికేషన్స్ ఉపయోగాలను వివరించారు. ఈ సందర్భంగా రత్నాకర్ మాట్లాడుతూ విద్యావేత్తలు, పరిశోధకులను ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్‌లో పునాది జ్ఞానం, ఆచరణాత్మక నైపుణ్యాలతో సన్నద్ధం చేయడం, ప్రత్యేకంగా కంప్యూటర్ విజన్, మెడికల్ ఇమేజింగ్, బయోమెట్రిక్ సెక్యూరిటీ అప్లికేషన్స్‌లో దాని అనువర్తనాలపై దృష్టి పెట్టడం ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం లక్ష్యమని చెప్పారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్ వైద్య రోగనిర్ధారణ, ఇమేజ్ ప్రాసెసింగ్, నిఘా వ్యవస్థలను ఎలా మెరుగుపరుస్తుందో, అలాగే బయోమెట్రిక్ భద్రత రంగంలో ముఖ గుర్తింపు, ఐరిస్ గుర్తింపు, వేలిముద్ర విశ్లేషణ, వాయిస్ గుర్తింపును ఉపయోగించి అధునాతన ప్రామాణీకరణ పద్ధతులను కవర్ చేస్తుందని చెప్పారు. డైట్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. వైకుంఠరావు ప్రారంభోపన్యాసం చేశారు. డైట్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం అధిపతి డాక్టర్ పి. పూర్ణప్రియ సమన్వయం చేస్తున్నారు. ఎన్ఐటి వరంగల్ సమన్వయకర్త డాక్టర్ ఎం. ఫరూఖ్ హష్మి ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్ సాధనాలను విద్యా చట్రంలో ఏకీకృతం చేయడం ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. ఎన్ఐటీ వరంగల్‌కు చెందిన కీలక విద్యావేత్తలతో పాటు ఐఐటీలు, ఎన్ఐటీలు, ఐఐఐటీల నిపుణులు కార్యక్రమం అంతటా ఉపన్యాసాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డైట్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. దుర్గా శ్యామ్, అకాడెమిక్స్ డీన్ డాక్టర్ కె.పార్వతి, అన్నివిభాగాల విభాగాధిపతులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ సెమినార్‌లో పాల్గొన్న దృశ్యం

ఐసిఆర్ పత్రాలు చూపుతున్న సీట్లు పొందిన విద్యార్థులు

కొనసాగిన పాలిసెట్ కౌన్సెలింగ్

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి మండలం రేబాక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రెండో రోజు పాలిసెట్ కౌన్సిలింగ్‌కు విద్యార్థుల నుంచి అనూహ్య స్పందన లభించింది. రెండో రోజు మంగళవారం 12 వేల ఒకటో ర్యాంక్ నుంచి 27 వేల ర్యాంకు వరకు కౌన్సిలింగ్ నిర్వహించారు. మొదటి రోజు కన్నా రెండో రోజు అధిక సంఖ్యలో విద్యార్థులు హాజరయ్యారు. రెండవ రోజు 157 మంది ధ్రువపత్రాలను పరిశీలించి ఐసిఆర్ పత్రాలను అందజేసినట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఐవిఎస్ఎస్ శ్రీనివాసరావు తెలిపారు. 94 మంది బాలురు, 63 మంది బాలికలు హాజరయ్యారు. కాగా బుధవారం 27 వేల ఒకటవ ర్యాంక్ నుంచి 43 వేల ర్యాంకు వరకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నామని, ఉదయం 9 గంటలకు విద్యార్థులు తమ ధ్రువ పత్రాలతో హాజరుకావాలని కోరారు.

రానున్నది వైసిపి ప్రభుత్వమే

ప్రజాశక్తి-అనకాపల్లి

రాష్ట్రంలో జూన్ 4వ తేదీ తర్వాత ఏర్పడేది వైసిపి ప్రభుత్వమేనని, మళ్లీ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావడం ఖాయమని ఆ పార్టీ అనకాపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్ కుమార్ అన్నారు. స్థానిక రింగ్ రోడ్‌లోని వైయస్ఆర్సీపీ కార్యాలయంలో మంగళవారం జరిగిన అనకాపల్లి మండల స్థాయి కేడర్ ఆత్మీయ సమావేశంలో మలసాల భరత్ కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. జగన్మోహన్ రెడ్డి అమలు పరిచిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి చూసి ప్రజలు రెండోసారి అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్, జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ బీవీ సత్యవతి, మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు గొర్లి సూరిబాబు, వైసిపి మండల అధ్యక్షుడు పెద్దిశెట్టి గోవింద, పార్టీ నాయకులు భీశెట్టి జగన్, అన్నపూర్ణ బ్యాంకు మాజీ చైర్మన్ పిడి గాంధీ, విల్లూరి చంద్రశేఖర్, పలువురు ఎంపీటీసీలు సర్పంచులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్

మహిళా ప్రముఖులను సన్మానిస్తున్న యోగా సాధకులు

యోగాతో మెరుగైన ఆరోగ్యం

చోడవరం సుగర్ ఫ్యాక్టరీ మాజీ అడ్మినిస్ట్రేషన్ అధికారి పప్పల రమణమూర్తి

ప్రజాశక్తి-చోడవరం

శరీర ఆరోగ్యానికి వ్యాయామం అవసరమని, అది యోగాసనాల ద్వారా పొందవచ్చని చోడవరం సుగర్ ఫ్యాక్టరీ మాజీ అడ్మినిస్ట్రేషన్ అధికారి పప్పల రమణమూర్తి అన్నారు. వికాస్ సొసైటీ ఆధ్వర్యంలో 50 రోజులు యోగా వేసవి శిక్షణ శిబిరం పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నేటి కాలంలో జీవన ప్రమాణాలు మెరుగుపర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మానసిక ఒత్తిడికి అనేకమంది గురవుతున్నారని తెలిపారు. ఆధునిక ప్రపంచంలో నిరంతరం కష్టపడితే తప్ప మనుగడ సాధించలేని భయం ప్రజల్లో నెలకొందని, దీంతో ఆరోగ్యవంతులు కూడా అనారోగ్య బారిన పడుకున్నారని పేర్కొన్నారు. వీటిని అధికమించడానికి శరీరానికి ఎంతో కొంత వ్యాయామం అవసరమన్నారు. యోగా ద్వారా దానిని సాధించుకోవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా యోగా శిక్షణ పొందిన కొంతమంది మహిళా ప్రముఖులకు సన్మానించారు. ఈ కార్యక్రమంలో యోగా గురువు అ్రెపుశ్రీనివాస్, ప్రకృతి వైద్యుడు డాక్టర్ గుడివాడ బిస్మిల్లా, అప్పలరాజు పురం వికాస్ సొసైటీ ఎమ్‌డి కోన సరోజ, అధ్యక్షులు యర్రా దేవి తదితరులు పాల్గొన్నారు


సతీష్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న యువకులు

తెలుగు యువత నేత సతీష్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- కశింకోట

తెలుగు యువత మండల మండల నాయకుడు కాంద్రేగుల సతీష్ పుట్టినరోజు వేడుకలు కశింకోటలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా కేక్ కట్ చేశారు. పలువురు నాయకులు సతీష్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

వికలాంగ పిల్లల గుర్తింపునకు సర్వే

ప్రజాశక్తి-సబ్బవరం

మండలంలోని వికలాంగ పిల్లలను గుర్తించడానికి అధికారులు, సిబ్బంది ప్రత్యేక సర్వే నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారులు ఎస్ లక్ష్మణ్‌రావు, బిఎస్ఎన్ మూర్తి తెలిపారు. మంగళవారం వారు సర్వేను పరిశీలించిన అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ గోపాల్ నగర్ పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న సర్వేలో సోమవారం 10 సంవత్సరాలు వయస్సుగల వినికిడి లోపం గల విద్యార్థిని గుర్తించినట్లు తెలిపారు. విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రవాణా, భత్యం తదితర సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు. మండలంలో 14 మందిని గుర్తించి వారిని సమీపంలో ఉన్న పాఠశాలలో నమోదు చేయించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది బి సింహాద్రప్పడు, ఎస్ బేబీ రాణి తదితరులు పాల్గొన్నారు.

వికలాంగ పిల్లవాడితో మాట్లాడుతున్న విద్యాశాఖాధికారులు

హత్య కేసులో ఏడుగురు నిందితుల అరెస్టు

ప్రజాశక్తి-అనకాపల్లి

హత్య కేసులో ఏడుగురు నిందితులను అరెస్టు చేసి, వారి నుంచి కారు, సెల్ఫోను, నగలతో పాటు హత్యకు ఉపయోగించిన ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్పి మురళీకృష్ణ వెల్లడించారు. స్థానిక పోలీస్ అతిథి గృహంలో మంగళవారం విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. ఎస్పి అందించిన వివరాల ప్రకారం... అనకాపల్లి జిల్లా వి మాడుగుల మండలం ఎం కోటపాడుకు చెందిన సేనాపతి రామాంజనేయులు తన తండ్రి నాగరాజు ఇచ్చిన ఆరు లక్షల రూపాయలతో ఎం.కోటపాడులో రెస్టారెంట్ ఏర్పాటు చేసుకున్నారు. దానిని సక్రమంగా నిర్వహించలేక ఇంకా డబ్బు కావాలని, ఆస్తులు పంచాలని తన తల్లిదండ్రులను, సోదరుడు శివాజీని తరచూ వేధించడం, కొట్టడం చేసేవాడు. దీంతో విసుగు చెందిన తండ్రి సోదరుడు శీలమనేని గోపి, మేడం అంజిరెడ్డి, అందే నాగేంద్రబాబు, ఉప్పు తోట్ల మురళీకృష్ణ, పక్కన శివ అనే ఐదుగురితో కలిసి రామాంజనేయులను చంపేందుకు కుట్ర చేశారు. ఇందుకు ఎనిమిది లక్షల రూపాయలతో ఒప్పందం కుదుర్చుకుని అడ్వాన్స్‌గా రూ.6 లక్షలు

మాట్లాడుతున్న ఎస్పి మురళీకృష్ణ

ఇచ్చారు. ఈ మేరకు తండ్రి సోదరుడు మినహా నిందితులు ఈనెల 21న రెస్టారెంట్లో రామాంజనేయులకు మద్యం పట్టించి వడ్డాదిలో దింపుతామని కారులో ఎక్కించుకొని మధ్యలో కత్తితో పొడిచి హత్య చేశారు. మృతదేహాన్ని ఎలమంచిలి మండలం కొక్కిరేపల్లి వద్ద ట్యాంకులో వేసి పరారయ్యారు. ఈ నేపథ్యంలో మృతుని భార్య శ్రీదేవి ఈనెల 21 నుంచి తన భర్త కనిపించలేనట్టు 23వ తేదీన పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. దీనిపై మిస్సింగ్ కేసు నమోదు చేశారు. అయితే ఎలమంచిలి రూరల్ మండలం కొక్కిరాపల్లి వద్ద చెరువులో ఒక మృత దేహం ఉన్నట్టు తెలియడం, ఆ మృతదేహం తన భర్తది అని శ్రీదేవి చెప్పడంతో పోస్టుమార్టంలో హత్యగా గుర్తించారు. దీనిపై ఎస్పీ మురళీకృష్ణ ఆధ్వర్యంలో ఐదు బృందాలతో సమగ్ర దర్యాప్తుకు ఆదేశించారు. ఈ నేపథ్యంలో మంగళవారం తమ విఆర్ఓ సమక్షంలో రామాంజనేయులు తండ్రి నాగరాజు, సోదరుడు శివాజీతో పాటు మూడో ముద్దాయి శీలమనేని గోపి మాడుగుల పోలీస్ స్టేషన్లో లొంగిపోయారు. వారిచ్చిన సమాచారంతో మిగిలిన నలుగురిని అరెస్టు చేసినట్టు ఎస్పీ తెలిపారు. వారి నుంచి మారుతి స్విఫ్ట్ కారు, రూ.2250 నగదు, 23 గ్రాముల బంగారు ఆభరణాలు, ముద్దాయిల 6 సెల్ ఫోన్లు, నేరం కోసం ఉపయోగించిన కత్తి, నేరానికి ఉపయోగించిన రెండు టవళ్లు, ఏ3, ఏ4 బ్యాంక్ ఖాతాలలో రూ.75,000 నగదు గుర్తించినట్టు తెలిపారు. కేసు దర్యాప్తులో పాలుపంచుకున్న సిబ్బందిని ఎస్పీ మురళీకృష్ణ అభినందించారు. సమావేశంలో పట్టణ సీఐ శంకర్రావు, సిబ్బంది పాల్గొన్నారు.

పండగలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు, గ్రామస్తులు

ఘనంగా పెద్ద పైడిమాంబ పండగ

ప్రజాశక్తి- కె.కోటపాడు

మండలంలోని చౌడువాడ గ్రామ దేవత పెద పైడిమాంబ అమ్మవారి పెద్ద పండుగను గ్రామస్తులు మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. అమ్మవారి పండుగ ఐదేళ్లకోసారి నిర్వహిస్తుంటారు. ఇందులో భాగంగా ఆది, సోమవారాల్లో ఇక్కడ ఆలయ ప్రాంగణంలో భారీ ప్రభను ప్రదర్శించారు. ఊరి కట్టు కార్యక్రమాన్ని సాంప్రదాయపద్ధంగా నిర్వహించారు. ప్రధాన వీధుల గుండా అమ్మవారి రథాన్ని ఊరేగించారు. ఇతర ప్రాంతాలకు ఉద్యోగ ఉపాధి నిమిత్తం వెళ్లిన వారు అమ్మవారి పండుగ సందర్భంగా తిరిగి గ్రామానికి చేరుకోవడంతో సందడి వాతావరణం నెలకొంది. జిల్లా నలుమూలల నుండే కాక ఇతర జిల్లాల నుండి కూడా భక్తుల పెద్ద ఎత్తున తరలివచ్చారు. వరుసగా మూడు రోజులపాటు సురభి బృందంచే పౌరాణిక నాటకాలు ప్రదర్శించారు. ఎన్నికల కోడ్ ఉన్నందున బాణసంచా కాల్పలేదు. అమ్మవారి ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా గ్రామ పెద్దలు ప్రత్యేక ఏర్పాటు చేశారు . గ్రామంలో ఎస్సై లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

210 కేజీల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి- కొయ్యూరు

అక్రమంగా తరలిస్తున్న 210 కేజీల గంజాయిని కొయ్యూరు పోలీసులు సోమవారం పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... కొయ్యూరు ఎస్సై రామకృష్ణకు వచ్చిన సమాచారం మేరకు చీడిపాలెం జంక్షన్ వద్ద సోమవారం పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సమయంలో బూదరాళ్ల నుండి కాకరపాడు వైపు వస్తున్న రెండు బైక్‌లు, ఒక ఆటోని పోలీసులు తనిఖీ చేస్తుండగా, వారిని చూసి నిందితులు పారిపోవడానికి ప్రయత్నం చేశారు. పోలీసులు నిందితులను పట్టుకొని తనిఖీ చేయగా 210 కేజీల గంజాయి లభ్యమైంది. వాహనాలను, గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. బోండా ప్రభాకర్, జర్సింగి గంతన్న, గల్లెలి రామారావు, జర్సింగి సంతోష్, లైచన్ తంగుల్, బాసుదేవ్ తంగుల్ తదితర ఆరుగురు నిందితులను పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. పట్టుబడ్డ గంజాయి విలువ రూ.10.55 లక్షలు ఉంటుందని చెప్పారు.

పట్టుబడిన గంజాయి, నిందితులతో పోలీసులు

రుతు పరిశుభ్రతపై అవగాహన

దేవరాపల్లిలో అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

ప్రజాశక్తి- కశింకోట

కశింకోట మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ప్రపంచ రుతు పరిశుభ్రత దినోత్సవం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా సిడిపిఒ పి.ప్రభావతి మాట్లాడుతూ యుక్త వయసులో ఉన్న బాలికలు రూతుక్రమంపై అవగాహన కల్పించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా రుతు క్రమం, మహిళల ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం, వీడియో ద్వారా అవగాహన కల్పించారు. ముందుగా రుతుక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏసిడిపిఒ శశికళ, ఎంఎంఎస్ అధ్యక్షులు లక్ష్మి, అంగన్వాడీ సూపర్వైజర్లు సుచరిత, ఆదిలక్ష్మి, వంశీప్రియ, ఎంఎల్‌హెచ్‌పి నవ్య దుర్గ, ఏపిఎం ఎస్ శ్రీనివాసరావు, సిసిలు అనురాధ, నిర్మల సత్యనారాయణ, రామకృష్ణ, శ్రీను, విఓఏలు, కిషోర బాలికలు పాల్గొన్నారు.

దేవరాపల్లి : ప్రతి మహిళ తన ఆరోగ్య సంరక్షణ కోసం అవగాహన పెంచుకోవడంతో పాటు హక్కుగా భావించాలని స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారిణి ఈ.పూజ్య మేఘన అన్నారు. స్థానిక ఇందిర క్రాంతి పథం కార్యాలయంలో మంగళవారం రుతు పరిశుభ్రత దినోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మహిళలకు అవగాహన కల్పించారు. గుడ్లు, పాలు, ఆకుకూరలు, పప్పు వంటి ఆహారాన్ని తీసుకోవాలని వైద్యాధికారిణి సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపిఎంఎస్ ప్రభాకరరావు, వైద్య సిబ్బంది రాణి, హైమా, ఆశా కార్యకర్తలు, మహిళా పోలీసులు మీరాభి, సంధ్యారాణి, ఐసీడీఎస్ సూపర్ వైజర్ ఆదిలక్ష్మి, సీసీలు, విఓఎలు, విద్యార్థులు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

నక్కపల్లి : యుక్త వయస్సులో రుతుక్రమం, పరిశుభ్రత, నిర్వహణ, ఇతర ఆరోగ్య, ఆహారపు అలవాట్లుపై కిశోర బాలికలకు అవగాహన ఉండాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ కె.లలిత సూచించారు. మంగళవారం నక్కపల్లి ఎస్‌సి కాలనీలో అంగన్వాడీ కేంద్రంలో రుతు పరిశుభ్రత, నిర్వహణ వార్షిక దినం పురస్కరించుకొని కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. పీరియడ్స్ సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, పరిశుభ్రత గురించి వివరించారు. ప్రోటీన్లు ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవాలన్నారు .అనంతరం ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో సీడ్ ఆర్గనైజర్ అమ్మాజీ, అంగన్వాడి యూనియన్ జిల్లా అధ్యక్షురాలు దుర్గారాణి, ఎంఎల్‌హెచ్‌వి, అంగన్వాడి కార్యకర్తలు, ఆశాలు పాల్గొన్నారు .

గొలుగొండ : రుతుక్రమం ఆరోగ్యం, పరిశుభ్రత దినోత్సవాన్ని పురస్కరించుకొని గొలుగొండ పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ శ్యామ్ కుమార్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ రుతుక్రమ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. చీడిగుమ్మల పిహెచ్‌సి పరిధిలో వైద్యాధికారులు డాక్టర్ బీ.ధనుంజై, డాక్టర్ మధుసూధనరావు ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌వి, ఎంపిఐహెచ్‌పి, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆనందపురం : ఆడవారిలో నెలవారీ రుతుక్రమంపై ఉన్న అపోహలు వీడాలని ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎం.గంగునాయుడు పేర్కొన్నారు. రుతుక్రమం పరిశుభ్రత దినం సందర్భంగా ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అన్ని హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్లలో మంగళవారం అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించారు. ఆనందపురంలో జరిగిన కార్యక్రమంలో గంగునాయుడు మాట్లాడారు. ఆడవారిలో పీరియడ్స్ అనేది సాధారణ శరీర ప్రక్రియ అన్నారు. ఈ సమయంలో ఆడవారికి పనిలో మగవారు సహాయపడాలని సూచించారు. ఆడవారిలో మానసిక దృఢత్వం పెంపొందించే దిశగా ఆరోగ్య సిబ్బంది అవగాహన కల్పించాలని ఆదేశించారు. శానిటరీ నాప్కిన్స్ వాడేలా, రక్తహీనతకు మందులు వాడేలా ఆడవారిలో అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి పి.సాంబమూర్తి, ఆరోగ్య పర్యవేక్షకులు పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

గొలుగొండలో ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

మహిళల ఆరోగ్యం వారి చేతుల్లోనే

అనకాపల్లి : మహిళల ఆరోగ్యం కాపాడుకోవాల్సిన బాధ్యత మహిళల్లోనే ఉందని జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కే శచీదేవి పేర్కొన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం మహిళల ఆరోగ్యంపై జరిగిన అవగాహన సదస్సులో ముఖ్యఅతిథిగా మాట్లాడారు. యుక్త వయసులో ఉన్న బాలికలు, మహిళలు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఎన్టీఆర్ వైద్య కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ సిందూ మహిళలు ఎదుర్కొంటున్న పలు గైనిక్ సమస్యలకు పరిష్కారాలు తెలియజేశారు. కార్యక్రమంలో ఏపీడి డైసీ, డిఎల్‌డిఓలు మంజుల వాణి, ఉదయశ్రీ, విజ్ఞాన్ కళాశాల ప్రొఫెసర్ మనోజ్ఞ ప్రసంగించారు. అనంతరం విజ్ఞాన్ కళాశాల సౌజన్యంతో అందజేసిన సానిటరీప్యాడ్స్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆరోగ్యం పోషణ పరిశుభ్రత జిల్లా యాంకర్ పర్సన్ ఎల్ పద్మ, డిఆర్డిఏ మహిళ ఉద్యోగులు, వివో ఏలు, విజ్ఞాన్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల్లో తాగునీటి సమస్యలను పరిష్కరించాలి

మండల పరిషత్తు సమావేశంలో సభ్యుల డిమాండ్

మండల పరిషత్తు సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

గ్రామాల్లో తాగునీటి సమస్యలను పరిష్కరించాలని పలువురు ఎంపిటిసిలు, సర్పంచ్‌లు డిమాండ్ చేశారు. మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం మంగళవారం ఎంపిపి డి.నాగేశ్వరి దేవి అధ్యక్షతన ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా విజయరామరాజుపేట, నీలకంఠాపురం, పోలేపల్లి సర్పంచులు విజయకుమార్, నాగభూషణం, బుజ్జి, వైస్ ఎంపీపీ దొండా నారాయణమూర్తి, ఎంపిటిసి కోరుకొండ లీలావతి రమణ తదితరులు మాట్లాడుతూ తమ గ్రామాల్లో తాగునీటికి ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ హరీష్ దీనికి బదులిస్తూ కొత్త కాంట్రాక్టర్ వచ్చిన వెంటనే పనులు మొదలు పెడతామన్నారు. జడ్పిటిసి దొండా రాంబాబు మాట్లాడుతూ ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో అన్ని రాజకీయ పక్షాలు ప్రశాంత వాతావరణంలో ఎన్నికలకు కృషి చేయడం అభినందనీయమన్నారు. ఎన్నికల కోడ్ ఉన్నందున మండల సమావేశం సాదాసీదాగా జరిగింది. ఎంపీడీఓ వెంకటాచార్య, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

కూలి రేట్లు పెంచితేనే పనులు చేస్తాం

- ◆ స్పష్టం చేసిన దినసరి కూలీలు
- ◆ కాంట్రాక్టరుతో చర్చలు విఫలం
- ◆ ప్రారంభం కాని డొంకరాయి పవర్ కెనాల్ మరమ్మతు పనులు

ప్రజాశక్తి- సీలేరు

ఎపి జెన్కో సీలేరు కాంప్లెక్స్ పరిధిలోని దిగువ సీలేరు డొంకరాయి పవర్ కెనాల్ మరమ్మతు పనులు చేసే కూలీలు తమ కూలి రేట్లు పెంచాలని ఆందోళనకు దిగారు. ఈ కెనాల్ మరమ్మతు పనులను ఏపీ జెన్కో అధికారులు డొంకరాయి, మోతుగూడెం ఏపీ జెన్కో కాంట్రాక్టర్లకు అప్పగించారు. అయితే కాంట్రాక్టర్లు కూలీలకు చెల్లిస్తున్న కూలి రేట్లు గిట్టుబాటు కాకపోవడంతో దినసరి కూలీలు పనులు చేపట్టకుండా నిరాకరించారు. గత 10 సంవత్సరాల నుండి రోజు కూలి స్త్రీలకు రూ.250, పురుషులకు రూ.300 ఇస్తున్నారని, ప్రస్తుతం అన్నింటి ధరలు భారీగా పెరిగిన నేపథ్యంలో ఈ కూలి రేట్లు గిట్టుబాటు కాదని కూలీలు స్పష్టం చేశారు. వీరికి సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు చింతా రాంబాబు అండగా నిలిచారు. దీంతో ఏపీ జెన్కో అధికారులు డొంకరాయి కార్యాలయంలో కాంట్రాక్టర్లతో సమావేశం జరిపి కూలీలు దినసరి కూలి రేట్లు సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. సిఐటియు నేత రాంబాబు, కూలీలతో కాంట్రాక్టర్లు చర్చలు చేశారు. రోజుకి మహిళలకు రూ.400, పురుషులకు రూ.450 ఇస్తామని చెప్పారు. అయితే దానికి కూలీలు నిరాకరించారు. పురుషులకు రోజుకి రూ.600, మహిళకు రూ.500 ఇవ్వాలని కోరారు. అందుకు కాంట్రాక్టర్లు నిరాకరించడంతో చర్చలు విఫలమయ్యాయి. దీంతో మరమ్మతు పనులు నిలిచిపోయాయి.

పనులకు వెళ్లకుండా ఇంటిదారి పట్టిన కూలీలు

ఎన్‌టిఆర్‌కు ఘన నివాళి

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి సీనియర్ ఎన్‌టి రామారావు 101వ జయంతిని మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఎన్‌టిఆర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేకులు కట్ చేశారు. సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రజాశక్తి- విలేకర్ల యంత్రాంగం)

విశాఖ కలెక్టరేట్ : టిడిపి జిల్లా కార్యాలయంలో ఎన్‌టిఆర్ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ముందుగా కార్యాలయ ఆవరణలో ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ చిరంజీవిరావు మాట్లాడుతూ ఎన్‌టిఆర్ గొప్పతనాన్ని వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, పార్టీ విశాఖ దక్షిణ నియోజకవర్గం ఇన్‌ఛార్జి సీతంరాజు సుధాకర్, జివిఎంసి ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు. జివిఎంసి 33వ వార్డులో ఎన్‌టిఆర్ జయంతి వేడుకలు నిర్వహించారు. టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు విల్లూరి డాక్టర్ చక్రవర్తి మాట్లాడారు. ఎన్‌టిఆర్ వీరాభిమాని మేడ అప్పలరాజును సత్కరించారు. కార్యక్రమంలో తిరుమల దేవి చక్రవర్తి, బంటుపిల్లి సూర్యనారాయణ, కొల్లి శ్రీనివాసు పాల్గొన్నారు.

పెందుర్తి : పెందుర్తిలో ఎన్‌టిఆర్ చిత్రపటానికి టిడిపి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు కరక దేముడు, 96వ వార్డు కార్పొరేటర్ పిలా శ్రీనివాస్, వార్డు అధ్యక్షుడు వేగి పరమేశ్వరరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

భీమునిపట్నం : స్థానిక టిడిపి కార్యాలయంలో ఎన్‌టిఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు. పార్టీ నాయకులు చిక్కాల విజయబాబు, జెడ్‌పిటిసి గాడు వెంకటప్పడు, నాయకులు డిఎఎన్.రాజు, గంటా నూకరాజు పాల్గొన్నారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు.

మధురవాడ : జివిఎంసి 7వ వార్డు కార్పొరేటర్ పిళ్ళా మంగమ్మ గృహంలో ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూల మాలలు వేశారు. అనంతరం కేకు కట్‌చేశారు. చంద్రం పాలెంలో పిళ్ళా రాము ఆధ్వర్యాన జయంతిని నిర్వహించారు. వార్డు అధ్యక్షుడు పిళ్ళా నరసింగరావు, పిళ్ళా వెంకటరావు, 7వ వార్డు జనసేన అధ్యక్షుడు నాగోతి నర్సింహ నాయుడు, పోతిన సోముపాత్రుడు, కె.అచ్యుత రావు, శ్రీను, నాని, సతీష్, శంకర్, బాలాజీ పాల్గొన్నారు.

విశాఖ లీగల్ : విశాఖపట్నం టిడిపి లీగల్ సెల్ అధ్యక్షులు బత్తి రాజశేఖర్ ఆధ్వర్యాన ఎన్‌టిఆర్ జయంతిని టిడిపి జిల్లా ఆఫీసులో నిర్వహించారు. ఎన్‌టిఆర్ చిత్రపటానికి జిల్లా న్యాయవిభాగం అధ్యక్షులు పూలమాలవేశారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో పతివాడ గిరిధర్, కన్నూరు అప్పలనాయుడు, ధర్మాల దుర్గాప్రసాద్, బి.మీనా, ఎస్.సతీష్ కుమార్, పల్లా బాలాజీ, పొట్నూరు కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గాజువాక : పాత గాజువాకలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎన్‌టి.రామారావు చిత్రపటానికి ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఎన్‌టిఆర్‌కు భారతరత్న ప్రకటించాలని ఆయన డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో ప్రసాదుల శ్రీనివాస్, కార్పొరేటర్లు బోండా జగన్, పల్లా శ్రీనివాసరావు, గంధం శ్రీనివాసరావు, టిడిపి లీగల్ సెల్ విభాగం నాయకులు వెన్నెల ఈశ్వరరావు పాల్గొన్నారు.

గోపాలపట్నం : పశ్చిమ నియోజకవర్గం తెలుగుదేశం ఎమ్మెల్యే అభ్యర్థి పెతకంశెట్టి గణబాబు క్యాంపు కార్యాలయంలో ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గణబాబు, కార్పొరేటర్లు శరగడం రాజశేఖర్, బొమ్మిడి రమణ, దాడు వెంకట రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సీతమ్మధార : జివిఎంసి 26వ వార్డు తెలుగుదేశం అధ్యక్షులు ముక్కా కిషోర్ కుమార్ ఆధ్వర్యాన పార్టీ కార్యాలయంలో జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు కార్పొరేటర్ ముక్క శ్రావణి, పెద్ద లక్ష్మణ, తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవ : జివిఎంసి 11, 12 వార్డుల్లో టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఒమ్మి సన్యాసిరావు, 11వ వార్డు టిడిపి అధ్యక్షులు ముగడ రాజారావు ఆధ్వర్యాన ఎన్‌టిఆర్ చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్‌ను కట్ చేసి నాయకులకు, కార్యకర్తలకు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఒమ్మి అప్పలరాజు, బుడుమూరు గోవిందు, గాడి సత్యం, ఏడువాక సన్యాసిరావు, ఒమ్మి పోలారావు, కొత్తల గోపాల్, నమ్మి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖలో ఎన్‌టిఆర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న నేతలు

అనకాపల్లి జిల్లాలో...

అనకాపల్లి: స్థానిక టిడిపి పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో ఎన్‌టిఆర్ 101 జయంతిని మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనకాపల్లి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, టిడిపి జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్య బాబు, డాక్టర్ నారాయణరావు, కోట్ని బాలాజీ, కోట్ని రామకృష్ణ, కొణతాల వెంకటరావు, బోలిశెట్టి శ్రీనివాసరావు, బొడ్డేడ జోగి నాయుడు పాల్గొన్నారు. అనకాపల్లి ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రిలో గర్భిణులు, రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి కార్యాలయంలో కూటమి నాయకులు పరమేశ్వరారావు, కాటా రమేష్ తదితరులు ఎన్‌టిఆర్‌కు ఘనంగా నివాళులర్పించారు. సీనియర్ ఎన్టీఆర్ అభిమాన సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వేధుల రామారావు, పెనుమత్స వెంకటేశ్వరరాజు, కొణతాల బాల పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు నివాళులు అర్పిస్తున్న టిడిపి, జనసేన నేతలు

చోడవరం : ఎన్టీఆర్ జయంతి సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు, టిడిపి జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్య బాబు, నాయకులు జి మల్లు నాయుడు, గేదెల సత్యనారాయణ, మాజీ ఎంపీపీ వెంకట సత్యనారాయణ, మజ్జి గౌరీ శంకర్ పాల్గొన్నారు.

పరవాడ : పరవాడ సంత బయలు వద్ద టిడిపి మండల అధ్యక్షులు వియ్యపు చిన్నా ఆధ్వర్యాన ఎన్‌టిఆర్ చిత్రపటానికి టిడిపి రాష్ట్ర కార్యదర్శి బండారు అప్పలనాయుడు, మాజీ జెడ్పిటిసి పైల జగన్నాథరావు, మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు తదితరులు పూలమాలవేసి నివాళులర్పించారు. కేక్ కటింగ్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచకర్ల ప్రసాద్, కన్నూరు వెంకటరమణ, పైల మహాలక్ష్మీ నాయుడు, చింతకాయల ముత్యాలు, గొర్లి కనకారావు, నగిరెడ్డి చిన్నారావు, అట్ట సన్యాసి అప్పారావు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : ఎన్టీఆర్ 101వ జయంతి సందర్భంగా మండలంలోని బుచ్చయ్యపేట, రాజాం, పెదపూడి, తురకలపూడి తదితర గ్రామాల్లో ఎన్టీఆర్ చిత్రపటాలకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసిన నివాళులర్పించారు.

నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ ముక్కా శ్రావణి, కిశోర్ కుమార్

దేవరాపల్లి : మండలంలోని వేచలం గ్రామంలో ఎన్‌టిఆర్ జయంతి వేడుకలు ఎంపీటీసీ రెడ్డి శ్రీలక్ష్మి బలరాం, టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు రెడ్డి శ్రీను ఆధ్వర్యాన నిర్వహించారు. వేచలం పిహెచ్‌సిలో రోగులకు, రొట్టెలు, పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వంటాకు సింహాద్రప్పడు, వేచలపు గోవింద, రెడ్డి సాయి, వేచలపు నరసింహనాయుడు, మధు పాల్గొన్నారు.

మునగపాక : మునగపాక టిడిపి కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి ఆ పార్టీ నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం స్థానిక పిహెచ్‌సిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.టిడిపి నాయకులు దాడి ముసలి నాయుడు, పెంటకోట విజయ్, భీమరశెట్టి శ్రీనివాసరావు, ఆడారి మంజు, బి స్రవంతి, ఏపిఎం సత్యనారాయణ, ఆడారి లక్ష్మణరావు పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని సోమవారం, చింతలపాలెం, గొబ్బూరు గ్రామాలలో ఎన్‌టిఆర్‌కు ఘనంగా నివాళులర్పించారు. టిడిపి నాయకులు గొంతిన శ్రీనివాసరావు ఎన్టీఆర్ చిత్రపటం పూలమాలలు వేశారు. పేదలు, వృద్ధులకు దుప్పట్లు, తవ్వాళ్ళు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గొంతిన చిరంజీవి, నైనంశెట్టి రమణారావు, ఉల్లింగల రమేష్, కర్రి దుర్గునాయుడు, మేడిశెట్టి వెంకటరమణ, జెర్రిపోతుల నూకునాయుడు, నారిపిల్లి ప్రసాద్ పాల్గొన్నారు

సబ్బవరం : టిడిపి మండల అధ్యక్షుడు మిడతాడా మహాలక్ష్మి నాయుడు అధ్యక్షతన ఆ పార్టీ కార్యాలయంలో ఎన్‌టిఆర్ జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి నేతలు గండి ముత్యాల నాయుడు, కోటాన అప్పారావు, బర్నికాన బాబురావు, గండి దేముడు, కె.రామకృష్ణరాజు, కరణం రాము నాయుడు, పడాల వెంకటరమణ, గవర అప్పారావు, గవర సత్యనారాయణ, పల్ల తాతారావు, బర్ల రమణ తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్ : మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు ఇంటి వద్ద మంగళవారం ఎన్‌టిఆర్ 101వ జయంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. అనంతరం అభిమానులు, పార్టీ కార్యకర్తలకు మిఠాయిలు పంచారు. టిడిపి కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

నక్కపల్లి : టిడిపి ఎన్‌టిఆర్ జయంతిని పురస్కరించుకుని నక్కపల్లి క్రిష్ టౌన్‌షిప్‌లోని తన స్వగృహంలో పార్టీ శ్రేణులతో కలిసి ఎన్‌టిఆర్ చిత్రపటానికి తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు, కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనిత పూలమాల వేస్తే నివాళులర్పించారు.కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు పంచిపెట్టారు .స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ ప్రాంతంలో ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహానికి తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ పార్టీ శ్రేణులతో కలిసి పూల మాలలు వేసి నివాళులర్పించారు .కేక్ కట్ చేశారు. ఉపమాకలో టిడిపి నేత కొప్పిశెట్టి బుజ్జి ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ జయంతి నిర్వహించారు .

కొత్తకోట: టిడిపి వ్యవస్థాపకుడు మాజీ ముఖ్యమంత్రి, ఎన్టీ రామారావు 101వ జయంతిని రావికమతం మండలం టి.అర్జాపురం, కొత్తకోట, జెడ్ కొత్తపట్నం, గంపవానిపాలెం, తదితర గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. కొత్తకోటలో చోడవరం నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు కోట నీలవేణి గోవిందరావు, టి అర్జాపురంలో టిడిపి మండల శాఖ అధ్యక్షులు రాజాన కొండనాయుడు ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ జయంతి వేడుకల్లో సర్పంచ్ మడగల అర్జున, గొర్లి శివ, ఎమాజీ సర్పంచులు, ఎంపిటిసిలు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

మాడుగుల: టిడిపి వ్యవస్థాపకుడు అన్న ఎన్‌టిఆర్ జయంతిని మాడుగులలో ఘనంగా నిర్వహించారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బండారు సత్యనారాయణమూర్తి, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిజి కుమార్ ఎన్‌టిఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. టిడిపి నేతలు పుప్పాల అప్పలరాజు, అద్దిపల్లి జగ్గారావు, రంజిత్ వర్మ, లెక్కల కాశి బాబు, రొబ్బ మహేష్, గట్రెరెడ్డి శివాజీ, బుద్దాల రమణ పాల్గొన్నారు.

గొలుగొండ : మండలంలోని కొత్త జోగంపేట గ్రామంలో మండల పార్టీ అధ్యక్షులు అడిగర్ల అప్పలనాయుడు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. తెలుగుజాతి గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి ఎన్టీఆర్ అని కొనియాడారు. పార్టీ సీనియర్ నాయకులు చిటికెల సాంబమూర్తి, మాజీ సర్పంచ్ సుర్ల బాబ్జి, గెడ్డం సత్యనారాయణ, పాత మల్లంపేట నాయకులు గెడ్డం ఆనంద్, గొర్లి సత్యనారాయణ పాల్గొన్నారు,

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

మాట్లాడుతున్న ఎంపిడిఒ

ప్రజాశక్తి -కోటవురట్ల :ప్రభుత్వ విధుల పట్ల సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యం వహించరాదని ఎంపిడిఒ కాశీ విశ్వనాథరావు మంగళవారం పలు సచివాలయాలను సందర్శించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ సకాలంలో విధులకు హాజరవడంతోపాటు గ్రామీణ ప్రాంతాల ప్రజల అవసరాలను సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు,

ప్రధానంగా పారిశుధ్యం తాగునీరు వంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టి, ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో కోటవురట్ల కార్యదర్శి శ్రీనివాస్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

ప్రజాశక్తి -కోటవురట్ల : మహిళలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంపిడిఒ కాశీవిశ్వనాథరావు సూచించారు. మంగళవారంమండల కేంద్రంలోని మహిళా సమాఖ్య, శ్రీ శక్తి భవనం వద్ద మహిళల ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఎంపిడిఒ కాశీ విశ్వనాథ రావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎపిఎం రమణకుమారి మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే, వారి కుటుంబసభ్యుల ఆరోగ్యంపై దృష్టిసారించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వం ఇస్తున్న ఆరోగ్య పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం, ఇతర సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వెలుగు సిబ్బంది పలువురు మహిళలు పాల్గొన్నారు.

ప్రమాదభరితంగా ఎండిన చెట్టు!

తొలగించాలని స్థానికుల వినతి

లతలు అల్లుకున్న ఎండిన చెట్టు

ప్రజాశక్తి -కోటవురట్ల : మండల కేంద్రంలో ప్రధాన రహదారిని అనుకుని మండల పరిషత్ కార్యాలయం సమీపం లో బైక్ మెకానిక్ షాపు వద్ద ఒక చెట్టు ఎండిపోయి, రెండేళ్ళుగా ప్రమాద భరితంగా ఉందని స్థానికులు అంటున్నారు. అయితే ఎండిన చెట్టుకు పచ్చని తీగ జాతి లతలు అల్లుకోవడంతో పచ్చగా దర్శనమిస్తోంది. ఆ లతల సాయంతోనే ఇది నిలబడి ఉంటోందని స్థానికులు అంటున్నారు. ప్రస్తుత సీజన్‌లో ఈదురుగాలులతో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందు. ఎండిన చెట్టు కారణంగా ఎటువంటి ప్రమాదం ముంచుకొస్తుందోనని సమీపంలో ఉన్న వాళ్లు, అలాగే ప్రధాన రహదారిపై వెళ్తున్న వాహనదారులు, విద్యార్థులు ప్రజలు తీవ్ర ఇబ్బందులు, ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులకు పలుమార్లు చెప్పినాపట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, ప్రాణాపాయ ప్రమాదం ముంచుకు రాకముందే ఎండిన చెట్టును తొలగించాలని కోరుతున్నారు.

హడలెత్తిస్తున్న వడగాలులు!

- ఎండ తీవ్రతకు జనం ఉక్కిరిబిక్కిరి
- వీధులు, రోడ్లన్నీ నిర్మానుష్యం

ప్రజాశక్తి -నక్కపల్లి : ప్రచండభానుడు మంగళవారం నిప్పులు గక్కాడు .వేడి గాలులతో విరుచుకుపడ్డాడు. వడగాలులు, ఉక్కబోతతో జనం తట్టుకోలేక తల్లడిల్లారు. ఎండ వేడిమికి ఉక్కిరి బిక్కిరయ్యారు. 40 డిగ్రీల సెంటీగ్రేడ్‌కు పైబడి అధిక ఉష్ణోగ్రత నమోదు కావడంతో వృద్ధులు, పిల్లలు, గర్భిణులు ,బాలింతలు తీవ్ర అవస్థలు పడ్డారు ప్రయాణికులు వడగాలులు తట్టుకోలేక విలవిలలాడారు. రోహిణి కార్తె ఆరంభంలోనే ఇలా ఉంటే రానున్న రోజుల్లో పరిస్థితి ఏంటని జనం భయందోళన చెందుతున్నారు.

మంగళవారం ఉదయం నుండి సాయంత్రం వరకు ఏకరీతిన ఎండలు ఉండడం, వడగాల్పులు తీవ్రత ఎక్కువగా ఉండడంతో రోడ్లు నిర్మానుష్యంగా దర్శన మిచ్చాయి. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని కొందరు ప్రయాణాలను వాయిదా వేసుకున్నారు. అనేకమంది ఇళ్లకే పరిమితమయ్యారు.తప్పని పరిస్థితుల్లో పలు జాగ్రత్తలు తీసుకుని పలువురు ప్రయాణాలు సాగించారు. మహిళలు చీర కొంగు చెంగులను నెత్తిన కప్పుకుని ప్రయాణాలు సాగించారు. ఎండ తీవ్రతకు ఇళ్లల్లో గోడలు, ఇంట్లోని సామగ్రి, చివరకు బట్టలు కూడా వేడెక్కిపోయాయని స్థానికులు అంటున్నారు. తుఫాన్ ప్రభావంతో రెండు రోజులుగా మబ్బుల వాతావరణం ఉన్నా, అంతలోనే భగభగలాడే ఎండలు మండిపోవడం, మరికొన్నాళ్లు ఇదే పరిస్థితి ఉండొచ్చన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో ప్రజలు భీతిల్లుతున్నారు.

మండుటెండల దెబ్బకు నిర్మానుష్యంగా నక్కపల్లి జంక్షన్

పోస్టల్ బ్యాలెట్ స్ట్రాంగ్‌రూం పరిశీలన

బందోబస్తు సిబ్బందితో మాట్లాడుతున్న సిఐ

ప్రజాశక్తి -నక్కపల్లి : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పాయకరావుపేట అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన పోస్టల్ బ్యాలెట్ స్ట్రాంగ్ రూమ్‌ను మంగళవారం సిఐ విజయ్‌కుమార్ పరిశీలించారు.స్ట్రాంగ్ రూమ్ వద్ద ఏర్పాటు చేసిన బందోబస్తు సిబ్బందితో మాట్లాడారు. ఈ నెల 31న బ్యాలెట్ బాక్సలను అనకాపల్లి తరలిస్తామని, అప్పటివరకు అప్రమత్తంగా ఉండి, పటిష్ట భద్రత కల్పించాలని ఆదేశించారు .

రెండో రోజూ కొనసాగిన పాలిసెట్ సర్టిఫికెట్ల పరిశీలన

సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : నర్సీపట్నం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం పాలీసెట్ 2024 రెండో రోజు సర్టిఫికేట్ వెరిఫికేషన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా 12001 ర్యాంకు నుండి 27000 ర్యాంకు వరకు 102 మంది విద్యార్థులకు సర్టిఫికేట్ వెరిఫికేషన్ చేసినట్లు ప్రిన్సిపాల్ రామచంద్రరావు తెలిపారు. ఈ నెల 29న 27001 ర్యాంకు నుండి 43000 ర్యాంకు వరకు సర్టిఫికేట్ వెరిఫికేషన్ జరుగుతుందని తెలిపారు.

రైస్‌మిల్లు ధూళితో అవస్థలు

ఆందోళనలో ప్రయాణికులు, విద్యార్థులు

రైస్ మిల్లు వద్ద కమ్మేసిన ధూళి

ప్రజాశక్తి -కోటవురట్ల: మండల కేంద్రం సమీపంలోని లింగాపురం సెంటర్ వద్ద గల రాయుడు ఆగ్రో రైస్ మిల్లు నుంచి వస్తున్న ధూళితో ప్రయాణికులు, విద్యార్థులు, స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రహదారిని అనుకుని ఉన్న ఈ రైస్ మిల్లు నుంచి దుమ్ము ధూళి నిత్యం రోడ్లపైకి రావటమే కాకుండా రోడ్డంతా కమ్ముకుని కనిపించని పరిస్థితి ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు అంటున్నారు. రైస్ మిల్ సమీపంలోనే ఆదిత్య, విద్యాంజలి పాఠశాలలు ఉండడంతో విద్యార్థులు తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు, నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలో ఈ మిల్లు నుంచి విపరీతమైన ధూళి రోడ్లపైకి రావడం, సమీపంలో ఉన్న విద్యాసంస్థలోకి ధూళి కమ్ముకోవడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారంటున్నారు అధికారులు స్పందించి ధూళి నిర్మూలనకు తగుచర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

దర్జాగా కొండగెడ్డ ఆక్రమణ!

ప్రజాశక్తి - చీడికాడ : ప్రధాన రహదారి పక్కనే కొండగెడ్డను ఆక్రమించి, యంత్రాలతో చదును చేయిస్తున్నా సంబంధిత అధికారులు స్పందించకపోవడం విచారకరమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చీడికాడ మండలంలోని గుంటి కొత్తూరు, కోణం గ్రామాలకు ప్రధాన రహదారికి మధ్యలో గుంటి కొత్తూరు సమీపాన కొండగెడ్డ ప్రవహిస్తుంది. రహదారి నిర్మాణ సమయంలో ఈ గెడ్డపై వంతెనను ఏర్పాటు చేశారు. చీడికాడ నుండి కోణాం వెళ్లే ప్రధాన రహదారిలో వంతెన సమీపాన భూమి ఉన్న రైతు ఒకరు కొండగడ్డను ఆక్రమించేందుకు రంగం సిద్ధం చేశారు. జెసిబితో గెడ్డ వైపు తాటి చెట్లను కూలదోసి, వేయించి, గెడ్డకు సంబంధించిన భూమిని సుమారు 10 అడుగులు మేర ఆక్రమించేందుకు ప్రయత్నాలు చేశారు. గెడ్డను చదును చేసే క్రమంలో ప్రధాన రహదారి పక్కనే యంత్రంతో మట్టిని సైతం తవ్వేశారు. అయితే రైతుకు చెందిన భూమి సైతం తన పిత్రార్జితం కాదని కోణంకు చెందిన భూస్వాముల భూమిని గతంలో ఆక్రమించి సాగు చేపట్టారని, ప్రస్తుతం ఆ భూమికి ఆనుకుని ఉన్న గెడ్డను సైతం ఆక్రమించేసి సాగు చేసేందుకు ప్రయత్నాలు జోరుగా చేస్తున్నారని ఆరోపణలు చేస్తున్నారు. ఆక్రమణతో కొండగెడ్డ వెడల్పు కుదించుకుపోతుందని అంటున్నారు. నిత్యం ఇదే మార్గంలో అధికారులు, నేతలు ప్రయాణిస్తున్నా, ఈ తంతుపై పట్టించుకోక పోవడాన్ని పలువురు తప్పుపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, సర్వే జరిపి కొండ గెడ్డ స్థలం ఆక్రమణకు గురికాకుండా కాపాడాలని కోరుతున్నారు. దీనిపై చీడికాడ మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ కృష్ణంరాజు వద్ద ప్రస్తావించగా, తమ దృష్టికి రాలేదన్నారు. తహశీల్దార్‌కు తెలియజేసి,తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

గెడ్డను చదును చేసి పొలంలో కలిపేసుకుంటున్న రైతు

నిర్మాణం పూర్తయి నాలుగేళ్లయినా ప్రారంభానికి నోచుకోని హాస్టల్ భవనం

- ఉన్నత విద్యకు దూరమౌతున్న బాలికలు
- దూరప్రాంతాలకు వెళ్లి చదువుకోవాల్సిన స్థితి

ప్రారంభానికి నోచుకొని వసతి గృహం

ప్రజాశక్తి-రోలుగుంట : మండలంలో జె.నాయుడుపాలెం గ్రామంలో బాలికల వసతి గృహం నిర్మాణం పూర్తయి నాలుగేళ్లు కావస్తున్నా ప్రారంభానికి నోచుకోలేదని పిల్లల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో రెండు పంచాయతీలు, ఆరు గ్రామాలకు చెందిన బాలికలు సుదూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవాలంటే ఇబ్బందులు ఎదుర్కంటు న్నారని, ఈ విషయాన్ని అప్పటి ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు దృష్టికి తీసుకువెళ్లడంతో 2018లో రూ.2కోట్ల 50లక్షలతో జిల్లా పరిషత్ పాఠశాలలో వసతి గృహానికి నిధులు మంజూరు చేశారు. పరవాడకు చెందిన గుత్తేదారుడు బిల్డింగ్ నిర్మాణం 2020 కల్లా పూర్తి చేశారు. 2019లో కొత్త ప్రభుత్వం ఏర్పడటంతో దీన్ని పట్టించుకోలేదు. ఈ గ్రామానికి చెందిన ఎంపిటిసి వెంకటనరేష్ జిల్లా అధికారుల దృష్టికి ఎన్నోసార్లు తీసుకువెళ్లినా వారు పట్టించుకోలేదు. ఇప్పటికైనా జిల్లా అధికారులు దృష్టిసారించి వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభానికైనా బాలికల హాస్టల్ భవనం ప్రారంభించేందుకు చర్యలు చేపట్టి, ఈ ప్రాంతంలో ఉన్న బాలికల ఉన్నత చదువులకు దోహదపడాలని జె.నాయుడుపాలెం, గుండుబాడు పంచాయతీలకు చెందిన ప్రజలు కోరుతున్నారు.

ప్రజాశక్తి
ఉద్యోగ విరమణ మరియు షష్టిపూర్తి శుభాకాంక్షలు
అతి తక్కువ ధరతో మీ ప్రకటన వేయబడును.
మీ సేవలు మరువలేనివి, మీరెక్కడున్నా మీ శ్రేయస్సును కోరుకుంటాం, అందించండి. ప్రజాశక్తి ద్వారా శుభాకాంక్షలు
మీ సహోద్యోగులు, మీ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులలో ఎవరైనా రిటైర్ అవుతున్నారా? మరియు షష్టిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు తెలపాలనుకుంటున్నారా? అయితే అందించండి వారికి అభినందన కుసుమాలు, ఆకాంక్షించండి వారి సుఖమయ జీవితాన్ని ప్రజాశక్తి ద్వారా తెలియజేయండి.
ఉద్యోగ విరమణ
షష్టిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు
మరిన్ని వివరాలకు మా స్థానిక ప్రతినిధులను సంప్రదించండి

సిటీ	9490099125	పూర్ణమార్కెట్	9490099676
మధురవాడ	8008596645	జగదాంబ	9490099434
గాజువాక	9849392359	జివియంసి	9490099483
అనకాపల్లి	8008736188	ద్వారకానగర్	9490099672
చోడవరం	9490099141	కంచరపాలెం	9490099135
నర్సీపట్నం	9440280411	మాదవధార	9490099675
పాడేరు	9490099142		